ప్రజాశక్తి

శనివారం 25 అక్టోబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

పంచగ్రామాలపై...
ఉలుకూ.. పలుకూ.. ఏదీ?



- రైతులకు హక్కులివ్వడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం
- కార్పొరేట్లకే భూములు?...

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'పంచగ్రామాల' భూములపై రైతులకు హక్కులివ్వడంపై చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర జాప్యానికి పాల్పడుతోంది. విశాఖ నగరంలో రూ.వేలకోట్లు విలువైన వందల ఎకరాలను ఐటి పారిశ్రామిక వేత్తలు, కార్పొరేట్ కంపెనీలకు భూములను ఎకరా 99పైసలకు లేదా ఉచితంగా ఇచ్చే చంద్రబాబు విధానంతో 'పంచగ్రామాల' రైతుల్లో ఆగ్రహావేశాలు తాజాగా రగులుతున్నాయి. మా భూములకు పరిష్కారం చూపకుండా ఈ భూపందేరాలా? అంటూ ప్రజలు, రైతులు తీవ్ర విమర్శలు చేయడం కనిపిస్తోంది. అయితే సిఎం చంద్రబాబు విశాఖ నగరానికి వచ్చిన ప్రతిసారీ తూతూ మంత్రంగా పంచగ్రామాలు ఏమయ్యాయి? అంటూ స్థానిక అధికార యంత్రాంగాన్ని అడగడం రివాజుగా మారింది. ముఖ్యమంత్రికి తెలియకుండా పరిష్కారం అయిపోతుందా? అంటూ పంచగ్రామాల రైతులు మండిపడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి.

మొదటి కేబినెట్‌లోనే అంటూ తాత్సారం...

2024లో అధికారంలోకి వచ్చిన మొదటి కేబినెట్ సమావేశంలోనే పంచగ్రామాల భూ సమస్యకు పరిష్కారం చూపి రైతులకు న్యాయం చేస్తామని అధికారంలోకి వచ్చిన 'కూటమి' ప్రభుత్వం ఇంకా జాప్యం చేయడం చూస్తే ఈ గ్రామాల్లో రైతుల సహనం కోల్పోయే స్థితికి ప్రభుత్వమే తీసుకొస్తుందన్న అనుమానాలు కలుగుతున్నాయి. చంద్రబాబు ముఖ్యమంత్రిగా 2014 నుంచి 2019 కాలంలోనూ, తర్వాత ప్రతిపక్ష నేతగా ఈ ప్రాంతాన్ని పర్యటించిన సమయంలోనూ, తాజాగా సిఎం స్థానంలో ఉండి కూడా పంచగ్రామాల రైతులకు మాటలతో సరిపెడుతున్నాడన్న విమర్శలు ఈ ప్రాంత రైతులు, ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి.

ఎన్నాళ్లీ సాగదీత... పరిష్కారం ఏమిటి?

పంచగ్రామాలు విశాఖ జిల్లాలోగల 5 అసెంబ్లీ సెగ్మెంట్లు (తూర్పు, పశ్చిమం, ఉత్తరం, పెందుర్తి, భీమునిపట్నం) పరిధిలో కూటమి పార్టీలకు చెందిన టిడిపి-3, బిజెపి -1, జనసేన -1 ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. వీరందరికీ బాధ్యత ఉన్నా పరిష్కారానికి 'పిల్లి మెడలో గంట ఎవరు కట్టాలి' అన్న ఆలోచనలో పడ్డారు. ప్రభుత్వంపై ఒత్తిడి తేలేకపోతున్నారు. సుమారు లక్ష మంది ప్రజలు, 25వేలకు పైగా కుటుంబాలకు చెందిన 1785 ఎకరాలు రైతులది. 2000 సంవత్సరంలో ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం జిఒ 578 తీసుకొచ్చి ఏకపక్షంగా ఈ భూమంతా సింహాచలం దేవస్థానానికి చెందుతుందని రైత్వారీ పట్టాలని స్థానిక చినగదిలి తహశీల్దార్ చేత ఇప్పించ్చింది. వాస్తవానికి అంతకు ముందే 1996-97 సంవత్సరంలో టిడిపి హయాంలో చినగదిలి, పెందుర్తి తహశీల్దార్‌లు 1785 ఎకరాలపై దేవస్థానానికి ఇచ్చిన రైత్వారీ పట్టాలతో దేవస్థానానికి హక్కు వచ్చింది. దీంతో 1785 ఎకరాల్లో నివాసాలుంటున్న ప్రజలు 30ఏళ్ల నుంచీ దేవస్థానం దృష్టిలో

మిగతా 2లో..

సిపిఎం నేత అప్పలరాజు గృహ నిర్బంధం

బల్క్‌డ్రగ్ వ్యతిరేక ఉద్యమంపై పోలీసు ఉక్కుపాదం

ప్రజాశక్తి -ఎస్.రాయవరం

అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ రాజయ్యపేట పర్యటన సందర్భంగా సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజును పోలీసులు గృహ నిర్భంధం చేశారు. బల్క్‌డ్రగ్ వ్యతిరేక ఉద్యమంపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామంలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు వద్దంటూ గత 41రోజులుగా నిరసన తెలుపుతున్న మత్స్యకారులతో చర్చలు జరిపేందుకు జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ వస్తున్న నేపథ్యంలో ముందుస్తు జాగ్రత్తగా ఉద్యమానికి మద్దతు ఇచ్చేవారిని రాజయ్యపేట రానివ్వకుండా గృహ నిర్భంధంలో ఉంచారు. ఈ సందర్భంగా సిపిఎం నేత అప్పలరాజు మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారులకు న్యాయం చేయకుండా ఉక్కుపాదం మోపుతుందన్నారు. మత్స్యకారులు జీవన పోరాటానికి తాము అండగా ఉంటామని స్పష్టంచేశారు.



సిపిఎం నాయకులు అప్పలరాజును గృహ నిర్బంధం చేసిన పోలీసులు

రైస్ పుల్లింగ్ పేరుతో ఘరానా మోసం

వార్త 3లో..

లోడర్స్‌కు బకాయి జీతాలు చెల్లించాలి

వార్త 5లో..

మందుగుండు తయారీ కేంద్రంలో పేలుడు
మహిళకు తీవ్ర గాయాలు

వార్త 5లో..

విద్యా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటం

వార్త 2లో..

జివిఎంసిలో కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : జివిఎంసిలోని వివిధ విభాగాలలో విధులు నిర్వహిస్తూ అకాల మరణం పొందిన వారి కుటుంబంలోని ఒకరికి చొప్పున కారుణ్య నియామకం ద్వారా 27 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి, ఎస్ఎస్.వర్మలతో కలిసి మేయర్ పీలా శ్రీనివాసరావు అందించారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ, కారుణ్య నియామకాలు పొందిన ఉద్యోగులు విధులు పట్ల అంకితభావంతో పనిచేసి ఉత్తమ ప్రతిభలను కనబరచాలని కోరారు. జివిఎంసి అభివృద్ధికి సేవలు అందించాలన్నారు. మజ్దూర్లు 7, ఆఫీస్ సబార్డినేటర్లు -5, పిహెచ్.వర్కర్లు -6, పిహెచ్ మేస్త్రిలు- 4, వర్క్ ఇన్స్పెక్టర్లు - 3, ఎలక్ట్రికల్ హెల్పర్-2 ఉద్యోగాలకు నియామక పత్రాలను అందించామని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎ.అప్పలనాయుడు, పర్యవేక్షకులు రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



కారుణ్య నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులతో మేయర్ పీలా శ్రీనివాసరావు తదితరులు

తగ్గిన నేరాలు

- రూ.1.10 కోట్ల విలువైన చోరీ సొత్తు రికవరీ
- పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి



రికవరీ చేసిన సొత్తును బాధితులకు అందిస్తున్న పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని క్రైమ్ విభాగం అద్భుత పనితీరు కారణంగా గడిచిన కొద్ది నెలలుగా నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సెప్టెంబర్ నెల రికవరీ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులైలో 100, ఆగస్టులో 105 కేసులు నమోదుకాగా, సెప్టెంబర్ నెలలో 79 కేసులు మాత్రమే నమోదయ్యాయని తెలిపారు. సెప్టెంబర్‌లో నమోదైన కేసుల్లో 56 విజయవంతంగా ఛేదించి, 64 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. వారి నుంచి రూ.46,05,050 విలువగల సొత్తును రికవరీ చేసినట్లు చెప్పారు. వీటితోపాటు రూ.64,05,000 విలువగల 427 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. రికవరీ చేసిన వాటిలో 766.35 గ్రాముల బంగారం, 699.6 గ్రాముల వెండి, రూ.1,95,800 నగదు, 12 మోటారు సైకిళ్లు, ఒక లారీ, 427 పోగొట్టుకోబడిన ఫోన్లు, 9 దొంగిలించబడిన ఫోన్లు, 9 ఎక్పైడ్ బ్యాటరీలు ఉన్నాయని తెలిపారు.

సెప్టెంబర్‌లో నగరవ్యాప్తంగా 257 సీసీ కెమెరాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. నగరంలో ఎవరైనా ఫోన్ పోగొట్టుకున్నట్టయితే చాట్ బాట్ నెంబర్ 9490617916 లేదా సిఇఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. రికవరీ మేళాలో భాగంగా పోగొట్టుకున్న వస్తువులను పోలీస్ కమిషనర్ బాధితులు అందించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ డిసిపి లతా మాధురి, ద్వారకా ఏసిపి అన్నెపు నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

'పంచగ్రామాల'పై ఉలుకూ.. పలుకూ.. ఏదీ?

ఆక్రమణ దారులుగా కొనసాగుతున్నారు. 12వేలకు పైగా ఇళ్లు ఈ భూముల్లో ఉన్నాయి. క్రమబద్ధీకరణకు సింహాచలం దేవస్థాన అధికారులు అడ్డుపడుతున్నారు. ఇది సక్రమం కాదంటూ రైతులంతా తర్వాత హైకోర్టును ఆశ్రయించారు. 2010లో విశాఖ ఆర్‌డిఒ కోర్టు తీర్పు రైతులకు అనుకూలంగా వచ్చినా ఆ తీర్పును ఇంతవరకూ ప్రభుత్వాలు అమలు చేయలేదు.

శాసనసభలో చట్టం ద్వారానే...

నిజంగా 'కూటమి' ప్రభుత్వానికి పంచగ్రామాల రైతులకు ఇచ్చిన హామీపట్ల చిత్తశుద్ధి ఉంటే పరిష్కారం వారి చేతుల్లోనే ఉంది. ఎంతకాలం గత తహశీల్దార్లు పొరపాటు చేశారంటూ నెపం నెడతారన్నది ప్రశ్న. రాష్ట్ర అసెంబ్లీలో చట్టం చేసి గతంలో 1996-97లో దేవస్థానానికి ఇచ్చిన రైత్వారీ పట్టాలను రద్దుచేయాలి. రైతుల భూముల వరకూ అంటే 1785 ఎకరాలకు అయినా మినహాయింపు ఇవ్వాలి.

ఏ హక్కూలేని కార్పొరేట్లకే పాలన పరిమితమా?

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

విశాఖ భూములపై ఎలాంటి హక్కూలేని కార్పొరేట్‌లు, ఐటి కంపెనీలు, పారిశ్రామిక వేత్తలకు విలువైన భూములు వందల ఎకరాలను ఒక్కో ఎకరా 99పైసలకే ఇచ్చేటి ముఖ్యమంత్రి చంద్రబాబు పంచగ్రామాల రైతులు, ప్రజల విషయంలో మీనమేషాలు లెక్కించడం తగదని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఎద్దేవా చేశారు. గూగుల్, అదాని డేటా సెంటర్, ఉర్సా, టిసిఎస్, కాగ్నిజెంట్, సత్వ కంపెనీలకు భూములిచ్చేముందు పంచగ్రామాల సమస్య గుర్తుకు రాకపోవడం 'కూటమి' వైఫల్యమని పేర్కొన్నారు. సత్వరమే ప్రభుత్వం పంచగ్రామాల సమస్యకు పరిష్కారం చూపేలా విధానం తీసుకోవాలని, లేదంటే తీవ్ర ప్రజా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

అదానికి భూ కేటాయింపు రద్దు చేసి గూగుల్‌కు ఇవ్వాలి

గూగుల్‌కు రూ.22 వేల కోట్ల రాయితీలు రద్దు చేయాలి

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : టిడిపి, వైసిపి ప్రభుత్వాలు విశాఖలో అదాని డేటా సెంటర్‌కు కేటాయించిన భూములను స్వాధీనం చేసుకొని గూగుల్ సంస్థకు ఇవ్వాలని, గూగుల్ సంస్థకు చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించిన రూ. 22,002కోట్ల ప్రజాధనం రాయితీని రద్దు చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. విశాఖ జగదాంబ సమీపంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో సిపిఎం గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి.జగన్, భీమిలి జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్.మూర్తిలతో కలిసి శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో జగ్గునాయుడు మాట్లాడారు. రూ.లక్షా 31వేలా 280 కోట్ల పెట్టుబడితో అంతర్జాతీయ ఐటి దిగ్గజం గూగుల్ విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు తమ డబుల్ ఇంజన్ సర్కార్ ఘనతని, దీనివల్ల లక్షా 88 వేలా 200 మందికి ఉద్యోగాలు వస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారని గుర్తుచేశారు. గూగుల్ అదాని డేటా సెంటర్ కొనసాగింపేనని, తమకు, అదానికి ఈ ఘనత దక్కాలని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారని తెలిపారు. గూగుల్ డేటా సెంటర్ వల్ల లక్షల్లో ఉద్యోగాలు వచ్చే అవకాశంలేదని బిజెపి నేతలు ప్రకటించారని పేర్కొన్నారు. గూగుల్ డేటా సెంటర్ వల్ల వేడి తీవ్రమౌతుందని, పర్యావరణానికి ప్రమాదమని, భవిష్యత్తులో విశాఖ ప్రజలు నీరు, విద్యుత్ సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందని పర్యావరణ వేత్తలు, మేధావులు చెబుతున్నారని తెలిపారు. నిరుద్యోగ సమస్యను ఆసరాగా తీసుకొని ప్రజల భూములను, ఆస్తులను కార్పొరేట్లకు కారు చౌకగా దోచిపెట్టడమే ప్రభుత్వ విధానంగా ఉందని సిపిఎం భావిస్తున్నట్లు తెలిపారు.

చంద్రబాబు ప్రభుత్వం 2019 జనవరి 9న అదాని గ్రూపుతో ఒప్పందం చేసిందన్నారు. రూ.70వేల కోట్ల పెట్టుబడి, లక్ష ఉద్యోగాలు వస్తాయని 400 ఎకరాల భూమిని కేటాయించిందని, ఇప్పటి వరకు ఒక ఉద్యోగం లేదు, నిర్మాణమూ జరగలేదని తెలిపారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత మరో ఒప్పందం జరిగి 2023 మే 3వ తేదీన రెండవసారి శంకుస్థాపన చేశారని పేర్కొన్నారు. రెండు ప్రభుత్వాలు ఒప్పందం చేసి ఆరేళ్లు పూర్తయిందని, ఈ భూముల్లో ప్రహరీ మాత్రమే నిర్మాణమైందని వివరించారు. ఇప్పుడు అదాని భాగస్వామ్యంతో గూగుల్ సంస్థ ఏర్పడుతుందన్నారు. అదాని గ్రూపు ఒప్పందాలు అమలు చేయనప్పుడు ప్రజల భూములు అదాని చేతిలో ఎందుకుండాలని ప్రశ్నించారు. 2019 నుండి అదానికి కేటాయించిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఈ భూముల్లో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఈ పని చేయకుండా ఆనందపురం మండలం తర్లువాడలో దళితుల భూములను గుంజుకొని, వాని జీవనాధారాన్ని దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్పొరేట్ల కోసం దళితులను, ప్రజలను బలిపెట్టడం ఆపాలని డిమాండ్ చేశారు. సింహాచలం పంచగ్రామాల భూసమస్యలో సుమారు 13 వేల మంది బాధితులు, రైతులు ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు, ముఖ్యమంత్రులు, ఎమ్మెల్యేలు మారుతున్నా కానీ గత 25 సంవత్సరాలుగా ఈ సమస్య పరిష్కారం చేయడంలేదన్నారు. అడవివరంలో గూగుల్ సెంటర్‌కు మాత్రం ఆగమేఘాల మీద భూ కేటాయింపులు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు భూములు, స్టాంపుడ్యూటీ, జిఎస్‌టి, నీటి ఛార్జీల రాయితీల పేరుతో రూ.22,002 కోట్ల ప్రజాధనాన్ని దోచిపెడుతుందని తెలిపారు. గూగుల్, అదాని సంపదతో డేటా సెంటర్ పెట్టమని చెప్పాలని, లక్షా 80 వేల ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి నిజంగా ఉద్యోగ కల్పనే ధ్యేయమైతే విశాఖ ఉక్కులో 2500మంది పర్మినెంట్, 5,500 మంది కాంట్రాక్టు కార్మికులను ఎందుకు తీసివేశారని, మరో 1500మందిని తొలగింపుకు ఎందుకు సిద్ధపడుతున్నారని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ బిజెపి నేతలు ఎందుకు ఈ తొలగింపులను ఆపడంలేదన్నారు. లక్ష ఉద్యోగాలు కల్పిస్తామని 400 ఎకరాలు తీసుకున్న అదానితో ఒప్పందం ఎందుకు రద్దుచేయడంలేదని ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

కేన్సర్ పేషెంట్లకు వాసుపల్లి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 33, 39 వార్డులకు చెందిన ఇద్దరు కేన్సర్ పేషెంట్‌లకు మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి వాసుపల్లి గణేష్ కుమార్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. 33వ వార్డులో నివాసం ఉంటున్న ఈటి లక్ష్మి ఇంటికి వెళ్లి పరామర్శించి మెడికల్ ఖర్చులకు రూ. 2,500 అందజేశారు. 39వ వార్డులో ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు సలీం భార్యకు ఆరోగ్య పరిస్థితి బాగోలేదని తెలుసుకొని ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి రూ.2500 ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో సనపల రవీంద్ర భరత్, రమేష్, ముజీబ్ ఖాన్, గనగళ్ల రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎఐ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ విశాఖపట్నం సెంటర్ ఆధ్వర్యంలో మూడు రోజులు నిర్వహించనున్న ఎఐ ఎక్స్‌పో -2025ను శుక్రవారంబీచ్ రోడ్డులోని నోవా హోటల్‌లో విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్మాణ రంగంలో ఆర్కిటెక్చర్ అత్యంత కీలక భూమిక పోషిస్తోందని, ఈ ఎక్స్‌పో ద్వారా ఆర్కిటెక్చర్ విభాగంలో అత్యాధునిక సాంకేతికతలను ఆవిష్కరిస్తున్నారని తెలిపారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ అఫ్ ఆర్కిటెక్ట్స్ విశాఖపట్నం సెంటర్ చైర్మన్ రాజేష్ నాగాల మాట్లాడుతూ, ప్రజల్లో ఆర్కిటెక్చర్‌పై అవగాహన కోసం ఈ ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని చెప్పారు. సాధారణంగా ఇళ్ల నిర్మాణం చేపట్టే వారికి ఏ వస్తువు ఎక్కడ దొరుకుతుందో తెలియక చాలా ఇబ్బందులు పడుతుంటారన్నారు. ఈ ఎక్స్‌పో ద్వారా ఆ సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ ఎక్సపోలో నిర్మాణ రంగానికి చెందిన అన్ని వస్తువులను ఒకే చోట ప్రదర్శిస్తున్నట్లు వివరించారు. ఈ ఎక్స్‌పోలో 40 స్టాళ్లు ఏర్పాటు చేశామని, వీటిలో ప్రధానంగా ప్లైవుడ్, ఇటాలియన్ మార్బుల్, ఆటోమేషన్, అల్యూమినియం విండోస్ అండ్ ఎలక్ట్రికల్ ఐటమ్స్, ఎయిర్ కండిషనింగ్, టైల్స్ అండ్ సానిటరీ ఐటమ్స్, అప్ హోల్డర్స్, పర్నిషింగ్ మెటీరియల్స్ ప్రదర్శనకు ఉంచామని తెలిపారు. ఇది కేవలం ఎగ్జిబిషన్ మాత్రమేనని ఇక్కడ ఎటువంటి అమ్మకాలు జరగవని, ఆసక్తిగల నిర్మాణదారులు ఆయా సంస్థల వివరాలు తెలుసుకొని వారిని సంప్రదించాలని సూచించారు.

సెంటర్ ఆధ్వర్యంలో ఆర్కిటెక్చర్‌కు సంబంధించి అత్యాధునిక సాంకేతిక ఆవిష్కరణలను చర్చించేందుకు పార్క్ హోటల్ వేదికగా ఇల్లుమినో 2025 పేరుతో "రోల్ అఫ్ లైటింగ్ ఇన్ ఆర్కిటెక్చర్" అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

విద్యా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటం

ఎఐఎస్‌ఎఫ్ బస్సు జాతాలో జాతీయ అధ్యక్షులు విరాజ్ దేవాంగ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షులు విరాజ్ దేవాంగ్ పిలుపునిచ్చారు. విద్యారంగంలో పేద, మధ్యతరగతి, దళిత, గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఎఐఎస్‌ఎఫ్) అధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రవ్యాప్త బస్సు జాతా శుక్రవారం విశాఖపట్నం చేరుకుంది. ఈ సందర్భంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరిగిన భారీ బహిరంగ సభలో విరాజ్ దేవాంగ్ మాట్లాడుతూ, పిపిపి పేరుతో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్, కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెట్టాలన్న ఆలోచనను కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జగన్ ప్రభుత్వం 107, 108 జిఒలు తీసుకొస్తే వాటిని రద్దుచేస్తామని నాడు యవగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీ ఇచ్చి నేడు విస్మరిస్తూ వైద్య విద్యను పూర్తిగా ప్రైవేటీకరణ చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో గిరిజన విద్యార్థుల మరణాలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ రూ.6400 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాల ఫీజుల దోపిడీని అరికట్టాలని, ఫీజు నియంత్రణ చట్టాన్ని సంబంధిత శాఖ అధికారులు పటిష్టంగా అమలుచేయాలని, పేదలకు ఉన్నత విద్యను దూరం చేసే జిఒ 77 రద్దు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 3480 ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్‌చేశారు. సభలో ఎఐడిఎస్‌ఓ జిల్లా అధ్యక్షులు అభిలాష్ పాల్గొని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లం నాగరాజు, రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వలరాజు,నాసర్ జీ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు కుల్లాయిస్వామి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలను రక్షించే విద్య సిపిఆర్ : ఎయు విసి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అత్యవసర సమయంలో కార్డియోపల్మనరీ రిససిటేషన్ (సిపిఆర్) చేసి వ్యక్తి ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని ఎయు విసి ఆచార్య జిపి.రాజశేఖర్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం హెల్త్ సెంటర్లో సెయింట్ లూక్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, విజయ లూక్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, జెడిఎస్ హాస్పిటల్‌తో సంయుక్తంగా నిర్వహించిన సిపిఆర్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి రాజశేఖర్ మాట్లాడుతూ ఒక ప్రాణాన్ని రక్షించే సాధనంగా సిపిఆర్ నిలుస్తుందన్నారు. ప్రతి విద్యార్థీ ఇటువంటి అంశాలలో తగిన తర్ఫీదు పొందాలని సూచించారు. ఇటీవల కాలంలో గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని, యువత సిపిఆర్ చేసే విధానాన్ని నేర్చుకోవడం, స్వయంగా చేయడం ద్వారా మరొకరి ప్రాణాలను రక్షించే అవకాశం ఏర్పడుతుందని చెప్పారు.

జెడిఎస్ ఆసుపత్రి ఎనస్థీషియా వైద్యులు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ, గుండెపోటు వచ్చిన సమయంలో సత్వరం స్పందించడం, సిపిఆర్ చేయడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. జెడిఎస్ ఆసుపత్రి ఎముకల వైద్య విభాగాధిపతి డాక్టర్ ఎన్.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తీ సిపిఆర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎయు వైద్యాధికారి డాక్టర్ జివివి.రామేశ్వర్, జెడిఎస్ వైద్యులు డాక్టర్ షేక్ హాజీ మస్తాన్, జెడిఎస్ హాస్పిటల్ ఎమ్‌డి పీటర్సన్ లూక్ తదితరులు పాల్గొన్నారు.

101 మందికి నియామక పత్రాలు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : ప్రధాన మంత్రి రోజ్‌గార్ యోజనలో భాగంగా 17వ రోజ్‌గార్ మేళా శుక్రవారం విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఏరినా వేదికగా తపాలా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ హాజరై నూతనంగా ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలు అందించారు. మొత్తం 11 శాఖలకు సంబంధించి 101 మందికి నియామక పత్రాలు అందించారు.

కోర్టుకు హాజరైన కార్మిక నేతలు



ట్రిబ్యునల్ కోర్టుకు హాజరైన కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్ ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు, నిర్వాసితుల ఉపాధిపై ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన కార్మిక నేతలు శుక్రవారం హైదరాబాద్‌లో కోర్టు వాయిదాకు హాజరయ్యారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ సిఐటియు ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ, కాంట్రాక్టర్ అసోసియేషన్ ప్రతినిధి టి.చక్రి. పి.అప్పలనాయుడు, సిఐటియు నేత ట్రిబ్యునల్ కోర్టు కేసును డిసెంబర్ 11కు వాయిదా వేసింది.

6న ఖాళీ దుకాణాల వేలం

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి ఐదోజోన్ పరిధిలో 40 నుంచి 63వ వార్డు వరకు ఖాళీగా ఉన్న దుకాణాలు, కల్యాణ మండపాలు, రోడ్ సైడ్ మార్కెట్లకు వచ్చేనెల 6న ఉదయం 11 గంటలకు జ్ఞానాపురంలోని ఐదో జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జెడ్‌సి బి.రాము గురువారం ప్రకటనలో తెలిపారు. 60వ వార్డు గుల్లల పాలెం షాపింగ్ కాంప్లెక్స్‌లో 22,23,24,28, 46,47,57 నెంబరు దుకాణాలు, అశోక్ నగర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 1,2,3 దుకాణాలు, ములగాడ షాపింగ్ కాంప్లెక్సులో 3వ నెంబర్, ప్రకాష్‌నగర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఐదో నెంబర్, గుల్లలపాలెం హాకర్ జోన్ బ్లాక్-ఎలో 1 నుండి 20 షాప్‌లకు , బ్లాక్-బిలో 21 నుండి 38 షాప్‌లకు, 51వ వార్డు మాధవ స్వామి కల్యాణ మండపానికి మూడేళ్ల కాలపరిమితికి అలాగే మార్కెట్లలో గుల్లలపాలెం దుకాణం, రోడ్ పక్కన మార్కెట్లకు ఏడాది కాలానికి వేలం వేస్తామన్నారు. ఆసక్తి గల వారు నిర్దేశిత

శ్రీరాములుకు పలువురు నివాళి

ప్రజాశక్తి పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి సర్పంచ్‌గా, భీమిలి సమితి ఉపాధ్యక్షునిగా పనిచేసిన సిరిగుడి శ్రీరాములు అంత్యక్రియలు శుక్రవారం రెడ్డిపల్లిలో నిర్వహించారు. అంత్యక్రియలలో భీమిలి మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారాం, భీమిలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి మజ్జిశ్రీనివాసరావు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర, వైస్ చైర్మన్ ఎస్ గిరిబాబు. భీమిలి ఎంపిపి వాసురాజు. మాజీ జెడ్‌పిటిసి కె. దామోదరరావు. మాజీమంత్రి అవంతి శ్రీనివాసరావు సోదరుడు మహేష్, పద్మనాభం మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



ఫోటో, బహుమతులు అందజేస్తున్న పులి లక్ష్మీబాయి.

ప్రజాశక్తి -గాజువాక : నెల్లిముక్కు జివిఎంసి మైదానంలో అయ్యన్నపాలెం శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో మూడు నెలలుగా నిర్వహించిన పెంటమాంబ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ముగిసాయి. పది జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో విజేత పెదగంట్యాడ నైటీ డిమోనేస్ జట్టుకు రూ.50వేలు, రన్నరప్ పెదగంట్యాడకే చెందిన లవ్‌యుస్టార్ జట్టుకు రూ.30వేలు, తృతీయస్థానంలో నిలిచిన పెదగంట్యాడ సికో వర్సెస్ జట్టుకు రూ.20వేలు, నాలుగో స్థానాల్లో నిలిచిన వైజాగ్ స్టీల్ జట్టుకు రూ.పది వేలు నగదు బహుమతులను శుక్రవారం 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి వెంకట రమణారెడ్డి దంపతులు అందజేశారు. కార్యక్రమంలో యువ నాయకులు పల్లా కార్తీక్, టిడిపి నేత కాతా బాలకృష్ణ, అయ్యన్నపాలెం గ్రామ ప్రెసిడెంట్ మొల్లి ఆనంద్ పాల్గొన్నారు.

అదాని సిమెంట్ ఫ్యాక్టరీ వద్దు



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి -ములగాడ: పెదగంట్యాడలో అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటును నిరసిస్తూ, దాన్ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ, ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో శ్రీహరిపురం వాకింగ్ పార్కు వద్ద మల్కాపురం జోన్ వార్యా నివాస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో మల్కాపురం జోన్ అధ్యక్షులు కె. నూకరాజు, నివాస్ జోన్ నాయకులు బి.తాతాజీ, జన విజ్ఞాన వేదిక జోన్ నాయకులు ఆర్ దేవరాజు, సుధాకర్ మాట్లాడుతూ అదాని సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టొద్దని పెద్ద ఎత్తున ప్రజలు ఆందోళన చేయడంతోపాటు ప్రజాభిప్రాయసేకరణను తిప్పికొడితే, మళ్లీ రెండవసారి ప్రజా సేకరణ పెడతామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గాజువాక పారిశ్రామిక ప్రాంతంలోని 10 లక్షల మంది ప్రాణాలతో చెలగాటమాడే సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటును విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు శేషావతారం, తమ్మారావు, వెంకట్రావు, సుధాకర్, లక్ష్మీనారాయణ సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణమూర్తి, నాయకులు కె.రమణ, కె.పెంటారావు, రాంబాబు పాల్గొన్నారు

నిత్యాన్నదానానికి రూ.2లక్షల విరాళం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం వరాహలక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో నిత్యాన్నదానానికి ఒడిశా గజపతి జిల్లా పర్లాకిమిడికి చెందిన బళ్ల సింహాచలం,పద్మావతి దంపతులు రూ. 1,00,116, వారి కుమారుడు బళ్ల మధు, లావణ్య దంపతులు మరో రూ.లక్ష కలిపి, మొత్తంగా రూ. 2,00,116 విరాళం అందించారు. విరాళాల కౌంటర్‌లో ప్రోటోకాల్, పర్యవేక్షణాధికారి పూసపాటి సునీల్‌కుమార్, ప్రోటోకాల్ సీనియర్ సహాయకులు వి. సూర్యనారాయణలకు విరాళాన్ని అందజేసి, రశీదు, బాండ్‌ను పొందారు. అనంతరం దాతలకు స్వామి అంతరాలయ దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

కోతకు గురౌతున్న క్రీడామైదానం

ప్రజాశక్తి- ఆనందపురం : పిఎంశ్రీ పథకానికి ఎంపికైన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానం కోతకు గురౌతోందని ఉపాధ్యాయులు, విద్యార్థులతోపాటు స్థానికులు ఆవేదన చెందుతున్నారు. గత ఏడాది వర్షాకాలంలో శిథిలమైన ప్రహరీ కూలిపోవడంతో సమీప బీసీ కాలనీ నుంచి వర్షపు నీరు పాఠశాల మైదానంలోకి రావడంతో పూర్తిగా కోతకు గురవుతోంది. పిఎంశ్రీలో హెచ్‌ఎం, పిఇటిల చొరవతో సుందరంగా తీర్చిదిద్దినప్పటికీ, వర్షపునీరు మళ్లింపు మార్గం లేక నేరుగా క్రీడామైదానంలోకి చొరబడడంతో కోతకు గురవ్వడంతోపాటు పాడౌతోంది. దీనిపై పాఠశాల సందర్శనకు వచ్చిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వయంగా పరిశీలించడంతోపాటు స్థానిక హెచ్‌ఎం, పిఇటి, ఇతర ఉపాధ్యాయులు సమస్యను విన్నవించినా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విశేషం.

రైస్ పుల్లింగ్ పేరుతో ఘరానా మోసం

ముగ్గురు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - ఆరిలోవ : రైస్ పుల్లింగ్ పేరుతో హైదరాబాద్‌కు చెందిన ఒక మహిళా డాక్టర్ కుటుంబం నుంచి అధిక మొత్తంలో వసూలు చేసిన ఘరానా ముఠాకు చెందిన ముగ్గురు వ్యక్తులను ఆరిలోవ పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం ఎసిపి అన్నెం నర్సింహమూర్తి,సిఐ సి.హెచ్.మల్లేశ్వరరావు వెల్లడించారు. పెందుర్తికి చెందిన వనుము శ్రీనివాసరావు, అరకు ప్రాంతానికి చెందిన కొర్ర బంగార్రాజు, విజయవాడకు చెందిన రౌడీషీటర్ కర్నాటి ప్రసాద్ అలియాస్ గుంటూరు ప్రసాద్ మరి కొంతమంది ఒక ముఠాగా ఏర్పడ్డారు. పుట్టపర్తికి చెందిన ఒక మహిళతో పరిచయమున్న హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ప్రియాంకను ఏడాదిన్నర క్రితం కలిసిన ముఠా సభ్యులు, ఆమెకు రైస్ పుల్లింగ్ చెంబును చూపించి, అతి విలువైన లోహాల మిశ్రంతో తయారు చేసిన చెంబుకు మహిమలు ఉన్నాయని నమ్మబలికారు. బయట మార్కెట్లో అమ్మితే రూ 30 కోట్లు వరకు వస్తుందని నమ్మించి , ఆమె వద్ద నుంచి పలు దఫాలుగా సుమారు రూ 1.50 కోట్లు వసూలు చేసారు. దీనిపై బాధిత డాక్టర్ ప్రియాంక ఈ నెల 19న ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేసారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టిన సిఐ మల్లేశ్వరరావు, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ముఠా సభ్యుల్లో కొంతమంది నగరంలోనే ఉన్నట్లు గుర్తించారు. లోవ పరిసర ప్రాంతాల్లో వనుము శ్రీనివాసరావు, కొర్ర బంగార్రాజు, కర్నాటి ప్రసాద్‌లను గురువారం అదుపులోకి తీసుకొని, శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి రూ 2.41 లక్షల నగదు, ఒక కారు, ఖరీదైన సెల్‌ఫోన్లు, నకిలీ పోలీసు ఐడి కార్డు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల బ్యాంక్ అకౌంట్లు సీజ్ చేసినట్టు తెలిపారు. ఈ కేసులో మరికొంతమంది ఉన్నారని, దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు తెలిపారు. ఇటువంటి మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఎసిపి నర్సింహమూర్తి సూచించారు.

కిడ్నాప్ కేసులో పరారీ నిందితుడి అరెస్ట్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఐదేళ్ల క్రితం డబ్బు కోసం కిడ్నాప్ కేసులో పరారీలో ఉన్న నిందితుడు బోయిన విష్ణును నాలుగో పట్టణ పోలీసులు పట్టుకున్నారు దీనికి సంబంధించిన వివరాలు నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఎసిపి కె లక్ష్మణమూర్తి వివరించారు.

2020 జులై 5వ తేదీన జామి సురేష్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారిని పల్లపు ప్రసాద్, భరత్‌నేని రామ్ రెడ్డి అలియాస్ ప్రతాపరెడ్డి, బోయిన విష్ణు, ఎండి లాయక్ అనే నలుగురు వ్యక్తులు కిడ్నాప్ చేసి రూ. ఐదు కోట్లు డిమాండ్ చేశారు చివరకు రూ. 70 లక్షలు ఇవ్వడానికి ఒప్పుకున్నారు తన దగ్గర అంత డబ్బు లేదని జామి సురేష్ చెప్పగా, సైట్ కొనుగోలుకు రుణానికి బంగారం తీసుకురావాలని అతని భార్యకు ఫోను చేసి కిడ్నాపర్లు చెపించారు. సీతంపేటలోని ఐఎఫ్‌ఎల్ దగ్గరకు రమ్మని చెప్పగా, అనుమానం వచ్చిన సురేష్ భార్య, అతని కుమారుడు డయల్ 100కు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకోవడంతో కిడ్నాపర్లు పరారయ్యారు. దీనిపై కేసు నమోదు చేసిన ఫోర్త్‌టౌన్ పోలీసులు, పల్లపు ప్రసాదు, ప్రతాప్ రెడ్డిలను అదే ఏడాది జులై 10న అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు నియమించిన పోలీసులు హైదరాబాద్ అత్తాపూర్ ఏరియాలో విష్ణును పట్టుకుని అరెస్ట్ చేశారు. మరో నిందితుడు 2021లోఉత్తరప్రదేశ్లో హత్యకు గురైనట్లు తెలుసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగావ్యవహరించిన పోలీసులను సిపి శంఖబ్రత బగ్చీ, డిసిపిలు అభినందించారని ఎసిపి లక్ష్మణమూర్తి తెలిపారు సమావేశంలో సిఐ ఉమాకాంత్, ఎస్ఐలు వెంకటరావు, బాలకృష్ణ, చిన్నమ్మ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గంజాయి కేసులో పరారీ నిందితుడి అరెస్ట్

ప్రజాశక్తి- పెందుర్తి: పరారీలో ఉన్న గంజాయి నిందితుడిని పెందుర్తి పోలీసులు పట్టుకున్నారు. గడచిన ఏప్రిల్‌లో గంజాయి కేసులో శివ సత్యనారాయణను అరెస్ట్ చేశారు. అప్పటో ఆయనకు గంజాయి సరఫరా చేసిన అల్లూరి జిల్లా హుకుంపేట మండలం దుంబికూడకు చెందిన గెమ్మెలి శ్రీను పరారయ్యాడు. పరారీ నిందితుడిని పట్టుకునేందుకు పెందుర్తి సిఐ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాలతో ఎస్ఐ భాస్కరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందం నిఘాపెట్టారు. నిందితుడు గెమ్మెలి శ్రీను అరకు వెళ్లేందుకు పెందుర్తి రైల్వేస్టేషన్‌కు వస్తున్నాడన్న పక్కా సమాచారంతో పోలీసులు నిఘాపెట్టి, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసులో నిందితులను పట్టుకునేందుకు చాకచక్యంగా వ్యవహరించిన సిఐ సతీష్‌కుమార్, ఎస్ఐ భాస్కరరావు, ఇతర సిబ్బందిని పోలీసులు ఉన్నతాధికారులు అభినందించారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

ప్రజాశక్తి -కొమ్మాది : పనోరమ హిల్స్ నుండి ఐటి జంక్షన్‌కు వెళ్లే దారిలో శుక్రవారం సాయంత్రం స్కోడా కారు డివైడర్‌ను ఢీకొట్టి ప్రమాదానికి గురైంది. కారులో వున్నవారు స్వల్పగాయాలతో బయట పడ్డారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి భీమునిపట్నం : వచ్చేనెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల 8,9,10 తరగతుల విద్యార్థులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు 'పౌరుల హక్కులు, విధులు' అంశం పై వ్యాస రచన, 'చట్టాలు, అవశ్యకత'పై వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు పాఠశాల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి మండల స్థాయిలో పోటీలకు అవకాశం కల్పించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డైట్ అధ్యాపకులు ఆర్ శుభలక్ష్మి, సి హెచ్ స్వామి పరిశీలకులుగావ్యవహరించారు.ఎంఇఒలు ఎం శివరాణి, ఎ జయప్రద, సిఆర్‌పిలు శివ దయాళ్, అప్పల కొండ, త్రినాథ్ పాల్గొన్నారు.

సీతమ్మధార : అక్కయ్యపాలెం ఎన్‌జిఒ కాలనీ జివిఎంసి ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వపోటీలు నోడల్ ప్రధానోపాధ్యాయురాలు జయంతి రాధా కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీతమ్మధార ఎంఇఒ డి రామారావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రాజ్యాంగ దినోత్సవం గొప్పదనాన్ని వివరించారు. ఎంఇఒ-2 బాలామణి , డైట్ లెక్చరర్ సునీత, సి ఆర్ పి భాగ్యలక్ష్మి, త్రినాద్, శ్రీరాఘవేంద్ర, ఎన్.సి.సి అధికారి ఎమ్ ఎన్ వి విశ్వనాథం, కిషోర్ వర్మ, శ్యామల పాల్గొన్నారు

క్రీడా దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-తగరపువలస: చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు సాయిసంహిత ఫౌండేషన్ అధ్యక్షుడు, అంబేద్కర్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు రూ.20వేల విలువైన క్రీడా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీవాణి సాయి సంహిత ఫౌండేషన్‌కు అభినందనలు తెలిపారు. ఎంఇఒలు ఎం.శివరాణి ఎ.జయప్రద, సిఆర్‌పి తాటిపూడి త్రినాథ్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధార్ బయోమెట్రిక్ చేయించాలి

ప్రజాశక్తి-భీమునిపట్నం : ఐదేళ్ల నుంచి 15ఏళ్ల లోపు బాలబాలికలకు ఈనెల 30లో నిర్దేశించిన సచివాలయాల్లో ఆధార్ బయోమెట్రిక్ చేయించాలని భీమిలి డివిజనల్ స్థాయి అభివృద్ధి అధికారి (డివిఎల్‌డిఒ) సిహెచ్ నిర్మలా దేవి స్పష్టం చేశారు. శుక్రవారం నాల్గో వార్డు నిడిగట్టు, జెవి అగ్రహారం సచివాలయాలను సందర్శించారు. ఉద్యోగులు హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు. ఆధార్ బయోమెట్రిక్ ప్రక్రియను పరిశీలించారు

సస్యరక్షణపై రైతులకు సూచనలు

ప్రజాశక్తి -పద్మనాభం: . మండలంలోని మద్ది, బాందేవపురం గ్రామాల్లో వరిపొలాలను శుక్రవారం. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ విశాలాక్షి, డాక్టర్ శిరీష సందర్శించారు. వరి పంటలో దోమపోటు గుర్తించారు దీని నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారి బి వెంకటాచలం పాల్గొన్నారు

న్యాయవాది హరనాథ్ కన్నుమూత

• సిపిఎం, ప్రజాసంఘాల నాయకుల సంతాపం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్/ మాధవధార : నగరంలోని కంచరపాలేనికి చెందిన న్యాయవాది నాగిరెడ్డి హరనాథ్(54) శుక్రవారం కన్నుమూశారు. సమాచారం తెలిసిన సిపిఎం, ప్రజాసంఘాల జిల్లా, స్థానిక నాయకులు ఆయన నివాసానికి వెళ్లి పార్థివదేహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు మాట్లాడుతూ, హరనాథ్ న్యాయవాదిగా ప్రజాసమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేసిన మానవతావాది అని కొనియాడారు. హరనాథ్ మరణం బాధాకరమని, వారి కుటుంబసభ్యులతోపాటు పార్టీకి, ప్రజాసంఘాలు, పలువురు కక్షిదారులకు తీరని లోటన్నారు. హరనాథ్‌కు భార్య, ఇద్దరు కుమారులు వున్నారు.

.హరనాథ్ 1989- 92 మధ్య విద్యార్థి దశలో ఎస్ఎఫ్ఐ ఆర్గనైజేషన్‌లోనూ, తర్వాత డివైఎఫ్ఐలో చేరి కంచరపాలెంలో యువతతో యువజన సంఘాన్ని ఏర్పాటు చేసి సమస్యలపై పనిచేశారన్నారు. .కంచరపాలెం జోన్ నివాస ప్రాంతాల్లో పార్టీ ప్రజా సంఘాలు నిర్మించారన్నారు. కంచరపాలెం ఒమ్మి రామ్మూర్తి చిట్స్ అండ్ ఫైనాన్స్ బాధితులకు అండగా నిలిచి న్యాయ సలహాలు అందించారని, వారితో సంఘాన్ని ఏర్పాటు చేయటంలో హరనాథ్ ఒకరిన్నారు. బొట్టా నరసింగరావు ఫౌండేషన్ ఏర్పాటు, వాటి కార్యకలాపాలలో భాగస్వామ్యం కావడంలో హరనాథ్ కృషి ఎంతో ఉందన్నారు. న్యాయవాది వృత్తిలో ఐలూ కోశాధికారిగా సంఘాన్ని బలోపేతం చేయడంలో కృషి చేశారన్నారు. ప్రజా పోరాటాలలో అక్రమ కేసులు పాలైన, జైలులో నిర్బంధించిన సందర్భాలో ఉద్యమకారులకు అండగా న్యాయస్థానంలో వాదనలను వినిపించారన్నారు.



న్యాయవాది నాగిరెడ్డి హరనాథ్ (ఫైల్)



హరనాథ్ పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నేతలు

హరనాథ్ మృతికి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి, కె.లోకనాథం, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, 78 వ వార్డు కార్పొరేటర్, విశాఖ జిల్లా సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు బి.పద్మ, సిపిఎం కంచరపాలెం జోన్ కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, అధ్యక్షులు కెఎం శ్రీనివాస్, పూర్వ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, ఉత్తరాంధ్ర అభివద్ధి వేదిక కార్యదర్శి ఎ.అజ శర్మ, సీనియర్ నాయకులు విఎస్ పద్మనాభరాజు, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఎన్. మాధవి, వై.సత్యవతి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు గుర్రం రవణ, ఎం.చంటి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.జి నాయుడు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యు.ఎస్.ఎన్ రాజు, పార్టీ నాయకులు సంతాపం తెలిపి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. హరనాథ్ అంత్యక్రియలు శనివారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఐలు సంతాపం

విశాఖ లీగల్ : ఐలు సీనియర్ నాయకులు, న్యాయవాది హరినాథ్ మరణం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్‌కు తీరని లోటని విశాఖపట్నం ఐలు నేతలు అన్నారు. హరనాథ్ మృతికి సంతాపం తెలిపి, శ్రద్ధాంజలి ఘటించారు. ఐలు గౌరవాధ్యక్షులు బివి రామాంజనేయరావు, ప్రధాన కార్యదర్శి ఎన్ వెంకటేశ్వరరావు, అధ్యక్షులు అల్లు సురేష్, ఉపాధ్యక్షులు బగాది తులసీదాస్ తదితరులు హరనాథ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

అనకాపల్లి : విశాఖలో న్యాయవాది, అఖిల భారత లాయర్స్ అసోసియేషన్ (ఐలు) నాయకులు ఎన్.హరినాథ్ మృతికి సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ ప్రగాడ సంతాపం తెలిపింది. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు విడుదల చేసిన ప్రకటనలో, హరనాథ్ మరణం సిపిఎంకు తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

2న రాష్ట్రస్థాయి పాటల పోటీలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న స్టీల్‌ప్లాంట్ జిఎం

ప్రజాశక్తి- ఉక్కునగరం : వైఆర్‌కె మ్యూజికల్ కాన్సెర్ట్, స్టీల్ క్లబ్ సంయుక్త నిర్వహణలో వచ్చేనెల 2న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్ర స్థాయి పాటల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహక ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం స్టీల్‌క్లబ్ కార్యాలయంలో పోటీల బ్రోచర్‌ను స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ (ఎంఎస్, సిఎస్ఆర్, అడ్మిన్) ఎం.మధుసూదనరావు ఆవిష్కరించారు. పోటీలు ముగిసిన రోజున బహుమతులు అందజేస్తామన్నారు. స్టీల్‌క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి వై.రవికుమార్,, కోశాధికారి దేవరకొండ వేణుగోపాల్, కార్యవర్గ సభ్యులు జె.రమేష్‌కుమార్, కె.రంగ నాథం, ఎం.వెంకటరాజు, జివి.రమణ, ఏ. రమేష్, కెఎల్. నరసింహం, విఎన్‌బి.రాజు, ఎం.భువనకిరణ్, ఎం.కృష్ణయ్య పాల్గొన్నారు.

ఎంవి.రావుకు ఎడ్యూ ఐకాన్ 2025 అవార్డు



ఎడ్యూ ఐకాన్ 2025 అవార్డు అందుకుంటున్న ఎంవి.రావు

ప్రజాశక్తి - ఆరిలోవ : మళ్ళ బ్యూరో ఆఫ్ చైల్డ్ డెవలప్‌మెంట్ వండర్ కిడ్స్ స్కూల్, నిసా, అపుస్మా, ట్రస్మా ఎడ్యూ ఐకాస్ 2025 అవార్డును ఆరిలోవ భారతీ ఇంగ్లీషు మీడియం స్కూలు అధినేత ఎం.వి.రావుకు అందజేసారు. విద్యా రంగంలో విశేష కృషి చేసినందున, పిల్లల్లో బలమైన నైపుణ్యాలు, విలువలు పెంపొందిస్తున్నందకు ఈ అవార్డును అందజేసారు. విశాఖలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో విశాఖ ఎంపీ ఎం.భరత్, నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అలయన్స్(నిసా) అధ్యక్షులు కె.శర్మ, అపుస్మా చీఫ్ మెంటార్ ఎ.కృష్ణారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు కె.తులసి విష్ణు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, తెలంగాణ రాష్ట్ర స్కూల్స్ మేనేజ్ మెంట్ అసోసియేషన్(ట్రస్మా) అధ్యక్షులు ఎస్.మధుసూదన్, బ్రెయిన్ ఫీడ్ ఎడ్యుకేషనల్ మ్యాగజైన్ సిఈఒ బ్రహ్మం వి.కాకాని చేతుల మీదుగా ఎంవి.రావు అవార్డును అందుకున్నారు.

ఎపి ఆర్యవైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షునిగా శ్రీనివాసరావు



శ్రీనాథ్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి -మాడుగుల: మాడుగులకు చెందిన వ్యాపారవేత్త శ్రీనాధు శ్రీనివాసరావుకు అనకాపల్లి జిల్లాలో అరుదైన పదవి లభించింది. ఎపీ ఆర్యవైశ్య పెరడేషన్ జిల్లా అధ్యక్షుడుగా ఇంటర్నేషనల్ వైశ్య పెడరేషన్ సంబంధించి ప్రతినిధులు ఎంపిక చేశారని ఆయన తెలిపారు. త్వరలో ప్రమాణ స్వీకారం జరుగుతుందన్నారు. ఈ పదవి రావడంతో స్నేహితులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తహశీల్దార్‌కు సత్కారం

ప్రజాశక్తి-పద్మనాభం.: ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందిన పద్మనాభం తహశీల్దార్ కె. ఆనందరావును శుక్రవారం మండల రెవెన్యూ కార్యాలయలో ఎంపిపి కె.రాంబాబు దుశ్శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మరిన్ని ఉన్నత ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించి అభినందించారు..

కిడ్నీ బాధితుడికి మేము సైతం ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న సొసైటీ ప్రతినిధులు

ప్రజాశక్తి- ఆనందపురం : ఒక కిడ్నీ కోల్పోయి, అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న మండలంలోని రామవరం గ్రామానికి చెందిన లంక బంగారురాజుకు 'మేము సైతం' సేవా సొసైటీ సభ్యులు మానవతా దృక్పథంతో ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. సొసైటీ అధ్యక్షులు ఎర్ర వెంకట అప్పారావు, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు చొరవ, సభ్యుల సహకారంతో రూ.50వేలు ఆర్థిక సాయాన్ని బంగారు రాజు కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మేము సైతం వ్యవస్థాపక అధ్యక్షులు అక్కిరెడ్డి దేముడు బాబు, ఉపాధ్యాయ సభ్యులు జె. రవీంద్రబాబు, ఈ. వెంకటేశ్వరరావు, లత, సొసైటీ పెద్దలు డి. లీలకష్ణంరాజు, కొల్లార్ ముత్యాలరావు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు



పోటీలను పర్యవేక్షిస్తున్న సిఐ, ఎస్ఐలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ."లైంగిక వేధింపుల నుంచి మహిళలకు, బాలికలకు రక్షణ కల్పించడంలో విద్యార్థుల పాత్ర" అంశంపై ఇంటర్, 8,9,10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో కెజిబివి 9వ తరగతి విద్యార్థిని వై ఉమాలహరి, జూనియర్ కళాశాల సెకెండియర్ విద్యార్థిని ఆర్.రాధిక, ప్రభుత్వ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థిని కె పూర్ణిమ, అలాగే.వక్తృత్వ పోటీల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫస్టియర్ విద్యార్థిని బి శ్రీలక్ష్మి, కెజిబివి 8వ తరగతి విద్యార్థిని బి వర్షిత, ప్రభుత్వ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థిని బి దక్షిత వరుసగా ప్రథమ, ద్వితీయ, తతీయ బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఎన్ఎస్ఎస్ 1,2 విభాగాలు, పోలీసుల సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి.రాంప్రసాద్, ఎన్ఎస్ఎస్ పిఒలు కె సూరిబాబు, పి సాయికుమార్, సిఐ బి తిరుమలరావు, ఎస్ఐ ఎన్ గౌరి, హెచ్ఎం పి రమణ, అధ్యాపకులు రామ్మూర్తి, ప్రసన్నలక్ష్మి, వేణుగోపాల్ పాల్గొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం ప్రాధాన్యతను వివరించారు.

సిమ్స్‌లో స్వాగతోత్సవం

ప్రజాశక్తి -మధురవాడ : కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (సిమ్స్)లో ఎంబిఎ, ఎంసిఎ నూతన బ్యాచ్ విద్యార్థులకు ర్టీ నెక్సస్ 2కె 25 పేరుతో స్వాగతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సిమ్స్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్‌పి.రవీంద్ర జ్యోతిప్రజ్వళనతో ప్రారంభించిన కార్యక్రమంలో బ్రిగేడియర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ, క్రమశిక్షణ, సంకల్పం ఉంచే అనుకున్నది సాధించవచ్చున్నారు. సిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.దీపికాదాస్ విద్యార్థులు సమాజానికి దోహదపడాలని ప్రోత్సహించారు. సిమ్స్ ప్రిన్సిపల్ డాక్టర్ యు.లారెన్స్ అధ్యక్షతన కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ వి.సాయిప్రశాంత్, వక్తి జీవితంలో విజయానికి సహకారం, జ్ఞానం నెట్‌వర్కింగ్ ప్రాముఖ్యతను వివరించారు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటలు, ప్రతిభ ప్రదర్శనలు అలరించాయి.

అన్నసమారాధన

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 94వ వార్డు కృష్ణానగర్‌లో దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అయ్యప్పస్వాములకు అన్నసమారాధనను ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్లుగా దేవాలయంలో అన్నదానం నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్త ఎర్ర నాగరాజును అభినందించారు కార్యక్రమంలో ఆలయ పూజారి స్వామి, కమిటీ సభ్యులు మన్మధరావు, మురళి పాల్గొన్నారు

నేడు భెల్ సిఐటియు మహాసభ

ప్రజాశక్తి -గాజువాక : ఈ నెల 25న శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు భెల్ సిఐటియు కార్యాలయంలో యూనియన్ 14వ మహాసభను నిర్వహించనున్నట్లు బిహెచ్‌పివి ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు ప్రధాన కార్యదర్శి జిటిపి ప్రకాష్ తెలిపారు. మహాసభకు జిల్లా, గాజువాక జోన్ కమిటీ నాయకులు పాల్గొంటారన్నారు. మహాసభలో జాతీయ మహాసభల జయప్రదంపై చర్చ, నూతన కమిటీ ఎన్నిక, భవిష్యత్తు కర్తవ్యాలు నిర్ణయిస్తారన్నారు. మహాసభను విజయవంతం చేయాలని యూనియన్ నేతలు కె.నారపరెడ్డి, ఎస్ జగన్నాధరావు, కె.విజయ్ కుమార్, పి కనకారావు, ఎస్ అప్పారావు కోరారు.

ఆర్ఎన్ ప్లేస్కూల్‌లో రెయిన్ డే

ప్రజాశక్తి- గాజువాక : స్థానిక అప్పన కాలనీ ఆర్ఎస్ ప్లేస్కూల్లో శుక్రవారం రైనీ డే నిర్వహించారు. చిన్న వయస్సు నుండే సమాజంలోని అన్ని విషయాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలలో భాగంగా . వర్షంలో తడవడం వల్ల వచ్చే రోగాలు, వర్షంలో తడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చిన్నారులకు పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు వివరించారు. ఈ సందర్భంగా నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి చిన్నారులంతా రంగు రంగుల గొడుగులు, నీలిరంగు దుస్తులు, ఇంద్రధనుస్సు పెయింటింగ్స్, ఆట పాటలతో సందడి చేశారు. కార్యక్రమం స్కూల్ సిబ్బంది సత్యవతి, సరోజిని, కిరణ్ వల్లి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇవిఎం గోదాముల తనిఖీ

ప్రజాశక్తి - ఆరిలోవ : చినగదిలి మండల కార్యాలయం సమీపంలో గల ఇవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరింధిర ప్రసాద్ తనిఖీ చేసారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఉదయం గోదాములను సందర్శించిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. సిసి కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్ళను పరిశీలించారు. భధ్రతా ప్రమాణాలపై అక్కడ అధికారులకు, భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేసారు. విజిటింగ్ రిజిస్టర్‌లో సంతకం చేసారు.

రైతు సాగు భూమిలో అక్రమంగా రోడ్డు నిర్మాణం

- హైకోర్టులో కేసు ఉండగా దౌర్జన్యం
- వత్తాసు పలికిన ఎపిఐఐసి, పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతు డిమాండ్



రైతు సాగు భూమిలో వేసిన తారు రోడ్డు



మాట్లాడుతున్న సిఐటియు నేత దేముడునాయుడు, చిత్రంలో బాధిత రైతు లాలం అప్పలనాయుడు

ప్రజాశక్తి- రాంబిల్లి : మండలంలోని లాలం కోడూరు శివారు చాటమెట్ట రెవెన్యూలో తమ కుటుంబం గత 50 సంవత్సరాలుగా సాగులో ఉన్న వ్యవసాయ భూమిలో సన్వేరా కంపెనీ యాజమాన్యం సహకారంతో సిరిమాన్ కెమికల్ ప్రైవేట్ కంపెనీ రోడ్డు నిర్మాణం చేసిందని బాధిత రైతు లాలం అప్పలనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూమి సమస్యపై కేసు హైకోర్టు పరిధిలో ఉండగా, ఎపిఐఐసి అధికారులు, పోలీసులు యాజమాన్యానికి వత్తాసు పలుకుతూ తనను దౌర్జన్యంగా పక్కకు నెట్టి, తనకు మద్దతు తెలిపిన ప్రజాసంఘాల నాయకులను కేసులు పెడతామని బెదిరించి రోడ్డు వేశారని వాపోయారు. ఆ భూమిలోకి అధికారులు ఎవరూ వెళ్లవద్దని హైకోర్టు ఆదేశాలుండగా, బాధిత రైతుకు అండగా ఉండవలసిన పోలీస్ అధికారులు, హైకోర్టు ఉత్తరుని బేఖాతరు చేస్తూ ఒక ప్రైవేటు కంపెనీకి వత్తాసు పలుకుతూ అక్రమంగా రోడ్డును వేయించడం దారుణమన్నారు. ఇటువంటి పాల్పడిన, అధికారులపైనా, స్థానిక పోలీసులపైనా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీని ఆశ్రయిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దేవుడు నాయుడు మాట్లాడుతూ రైతుకు అండగా ఉండవలసిన అధికారులు ఈ విధమైన చర్యలకు పాల్పడడం అన్యాయమన్నారు. అధికారుల చర్యలు కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందన్నారు. అధికారులు ఇలా వ్యవహరిస్తే రైతులు తమ గోడు ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. తక్షణమే ఇటువంటి చర్యలు మానుకోవాలని, బాధిత రైతు లాలం అప్పలనాయుడుకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని, 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.



ఎంపీ నుండి అవార్డు అందుకుంటున్న డాక్టర్ ఖాశీం

డాక్టర్ ఖాసీంకు జాతీయస్థాయి అవార్డు

ప్రజాశక్తి-కె.కోటపాడు : సేవా భావంతో అత్యుత్తమ విద్యను అందిస్తున్న డాక్టర్ ఖాసీంకు జాతీయస్థాయి అవార్డు లభించింది. స్థానిక అయ్యన్న ఇంగ్లీష్ మీడియం స్కూల్ సెక్రటరీ, కరెస్పాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఖాశీం విద్యా రంగంలో విశేష కృషి చేస్తున్నందుకు, పిల్లల్లో బలమైన నైపుణ్యాలు, విలువలు పెంపొదిస్తున్నందుకు మళ్ల బ్యూరో ఆఫ్ చైల్డ్ డెవలప్‌మెంట్ వారి వండర్ కిడ్స్ స్కూల్, నిసా, అపుస్మా, ట్రస్మా వారు "ఎడ్యూ ఐకాన్ -2025" అవార్డుకు ఎంపిక చేశారు. గురువారం విశాఖపట్నంలో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో విశాఖపట్నం ఎంపీ ఎం.భరత్, నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అలయన్స్ (నిసా) అధ్యక్షులు కె.శర్మ, "అపుస్మా" చీఫ్ మెంటార్ ఎ.కృష్ణారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు కె.తులసివిష్ణుప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, తెలంగాణ రాష్ట్ర స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) అధ్యక్షులు ఎస్.మధుసూదన్, బ్రెయిన్ ఫీడ్ ఎడ్యుకేషనల్ మ్యాగజైన్ సీఈఓ బ్రహ్మం వి.కాకాని చేతుల మీదుగా డాక్టర్ ఖాశీం అవార్డు అందుకున్నారు. ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డు రావడంపై స్థానిక అయ్యన్న విద్యాసంస్థల సిబ్బంది ఉపాధ్యాయులు అభినందించారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మి

మందుగుండు తయారీ కేంద్రంలో పేలుడు

మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని అంకుపాలెం గ్రామంలో మందుగుండు సామాగ్రి తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ప్రమాదంలో ఒక మహిళ తీవ్రంగా గాయపడింది. గ్రామంలోని దానిబోయిన నాగేంద్రకు చెందిన మందుగుండు తయారీ కేంద్రంలో కూలి పని నిమిత్తం అదే గ్రామానికి చెందిన ద్వారపూడి లక్ష్మి (50) అనే మహిళ శుక్రవారం వెళ్లింది. మందుగుండు తయారు చేస్తుండగా ప్రమాదవశాత్తు అది పేలిపోవడంతో లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి లక్ష్మిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఆమె ఒంటికి, చేతులకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానిక పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ మందుగుండు తయారీపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

లోడర్స్‌కు బకాయి జీతాలు చెల్లించాలి

సిఐటియు ఆధ్వర్యాన నిరసన



జోనల్ కమిషనర్‌తో వాగ్వివాదం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : జివిఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలోని లోడర్స్‌కు బకాయి పడ్డ జీతాలను వెంటనే ఇవ్వాలని జోనల్ కార్యాలయం వద్ద శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆ సమయంలో జోనల్ కమిషనర్ రావడంతో అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల శంకరరావు మాట్లాడుతూ 2024 ఆగస్టు, 2025 అక్టోబర్ జీతాలు వెంటనే లోడర్స్‌కి చెల్లించాలని, లేదంటే వచ్చే నెల ఒకటి తర్వాత ఎప్పుడైనా క్లాప్ వాహనాలను నిలుపుదల చేసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కావాలనే కాంట్రాక్టర్ ఆ రెండు నెలల జీతాలను కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రతి సంవత్సరంలో ఒక నెల వేతనాన్ని ఇవ్వకుండా ఆ వేతనాన్ని అక్రమంగా కాంట్రాక్టర్ నిలుపుదల చేస్తున్నారని, దీనికి అధికారులు సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఆ రెండు నెలల జీతాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈఎఫ్ఐ, పిఎఫ్ ఇవ్వాలని, ప్రతి నెల 10వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్, కార్మికులు ప్రసాద్, ఎస్, భారతి, భవాని, ఎం.బాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ఈ.బోనంగి గ్రామంలో రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాల తొలగింపు చర్యలు శుక్రవారం చేపట్టారు. సర్వే నెంబర్ 545లో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఫార్మా నిర్వాసితుల కోసం లేఔట్ రూపొందించి, అర్హులైన వారికి ఇళ్ల స్థలాలను అప్పటి ప్రభుత్వాలు మంజూరు చేశాయి. ఈ లేఔట్‌లో కొంతమంది వ్యక్తులు అక్రమంగా బినామీ పేర్లతో పట్టాలు సృష్టించి భూకబ్జా ప్రయత్నాలు చేయడంతో స్థానికులు కొంతమంది లోకాయుక్త కోర్టును ఆశ్రయించగా, ఆ కోర్టు ఆదేశాల మేరకు అప్పటి జిల్లా కలెక్టర్ 2014లో ఐదు మండలాల తహసీల్దార్లతో సమగ్ర విచారణ చేయించి మొత్తం 135 ప్లాట్లు బినామీలుగా గుర్తించబడ్డాయి. తదనంతరం ఆ లేఔట్‌లో రెవెన్యూ అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ఇటీవల ప్లాట్ నెంబర్ 326లో ఒకరు అక్రమ నిర్మాణం చేపట్టినట్లు రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందింది. దీనిపై స్పందించిన తహసీల్దార్ శుక్రవారం ఉదయం తమ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని ఆ నిర్మాణాన్ని తొలగించారు.

ఆర్ఎల్‌యులో తనిఖీలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కొత్తపెంట పశు సంరక్షణ యూనిట్ (ఆర్ఎల్‌యు)లో పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ మోపాడ చంద్రశేఖర్ శుక్రవారం తనిఖీలు చేసారు. యూనిట్‌లోని రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో కె.కోటపాడు సహాయ సంచాలకుడు డాక్టర్ ఈ.దినేష్‌కుమార్, కొత్తపెంట విఎల్‌వో శశికళ పాల్గొన్నారు.

ఆలయ భూమి ఆక్రమణపై వివరాలు సేకరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవుడు మాన్యం ఆక్రమణపై దేవాదాయశాఖ అధికారులు వివరాలు సేకరించారు. దేవరాపల్లి మండల కేంద్రంలోని ఉమామహేశ్వరి దేవి ఆలయం భూమి 3 ఎకరాల 24 సెంట్లు ఆక్రమణకు గురైందని దేవరాపల్లి గ్రామానికి చెందిన చొక్కాకుల రమణ ఇటీవలే పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా దేవాదాయశాఖ అధికారిణి కె.లక్ష్మీ సుధారాణి, దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ డి.వసంత్ కుమార్‌తో కూడిన బృందం శుక్రవారం ఆలయ ప్రాంగణాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. చుట్టుపక్కల ఉన్న షాపులను పరిశీలించి వారితో మాట్లాడారు. అద్దె ఎవరికి చెల్లిస్తున్నారు.. మీ దగ్గర రసీదు ఉందా..? అని షాపుల్లో ఉన్నవారిని అడిగారు. ఏడాదికి ఒక్కసారి రూ.12వేల పంచాయతీ వారికి చెల్లిస్తున్నామని, తమకు ఏమీ రసీదు ఇవ్వలేదని వారు తెలిపారు. వీటన్నిటిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, భూమి ఆక్రమణ, ఈ ఆలయానికి ఈవో నియామకంపై అధికారులకు నివేదిక పంపి త్వరలోనే చర్యలు చేపడతామని తెలిపారు.

కల్యాణ మండపం నిర్మించాలని వినతి

ప్రజాశక్తి-చోడవరం : అనకాపల్లి జిల్లా రజక సంఘానికి చోడవరంలో నూతనంగా కళ్యాణమండపం నిర్మాణం చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకు వినతిపత్రం అందించినట్లు అనకాపల్లి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చల్లపల్లి కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో బానే కోనేరు వద్ద రజక సామాజిక భవనం ఉందని, ఆ భవనాన్ని అప్పట్లో ప్రస్తుత ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు నిర్మాణం చేపట్టారని పేర్కొన్నారు. వివిధ కార్యక్రమాలకు కళ్యాణమండపం ఏర్పాటుకు ఎమ్మెల్యేని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

టిడిఆర్ బాండ్లకు వ్యతిరేకంగా ప్రచారం



నిర్వాసితులతో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ బాధితులకు నగద రూపంలో పరిహారం ఇవ్వకుండా టిడిఆర్ బాండ్లు ప్రభుత్వం ఇస్తున్న నేపథ్యంలో దానికి వ్యతిరేకంగా నిర్వాసితుల సంఘం నాయకులు ప్రచారం నిర్వహించారు. మండలంలోని గొర్లి ధర్మవరం, వెంకటాపురం గ్రామాలలో శుక్రవారం రహదారి విస్తరణ నిర్వాసితులను సంఘం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా సంఘం కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ ప్రభుత్వం రహదారులకు సేకరించే భూములకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇస్తామంటున్నా టిడిఆర్ బాండ్లు వలన నిర్వాసితులకు జరగబోయే ఆర్థికపరమైన నష్టాలను వివరించారు. భూములు కోల్పోయి చేతికి పరిహారం అందక రైతులు రోడ్డున పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితుల కంటే దళారులకు ప్రయోజనం కొరకు మాయ మాటలు చెప్పి రైతులను బాండ్లు తీసుకునేలా అంగీకరించేలా చెబుతారని, వాటిని నమ్మవద్దని హితవుపలికారు. ప్రభుత్వం నిర్వాసితుల సమస్యలను అర్థం చేసుకొని బాండ్ల ప్రతిపాదన నిర్మించుకోవాలని ఆయన కోరారు. లేనిపక్షంలో దశల వారీగా ఉద్యమం చేయబడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో, కూండ్రపు సోమునాయుడు, చేపల తాతయ్య, గొర్ల నూకరాజు, గొర్ల రమణ, వెంకటాపురం సర్పంచ్ కిల్లాడి తాతబ్బాయి, పేరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

సాగర్ సిమెంట్ స్కాలర్ షిప్‌లు పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం బయ్యవరం సాగర్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో వీరారెడ్డి మెరిట్ స్కాలర్ షిప్‌లు పేరున 13 పాఠశాలలకు రూ.5.85 లక్షలు స్కాలర్ షిప్‌లు శుక్రవారం పంపిణీ చేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో 13 పాఠశాలల్లో పదో తరగతిలో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.20వేలు, ద్వితీయ స్థానానికి రూ.15వేలు, తృతీయ స్థానం సాధించిన వారికి ఇరూ.10వేలు చొప్పున ఎంఇఒలు సురేష్ కుమార్, సూర్యనారాయణ మూర్తి చేతులు మీద గా అందజేశారు. కంపెనీ జనరల్ మేనేజర్ ఎన్‌వి.ప్రసాద్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జి.పాండురంగారావు మాట్లాడుతూ కంపెనీ పరిధిలోని బయ్యవరంలో తాగునీటి కోసం పైపులైన్ వేస్తామని చెప్పారు.

తాళ్లపాలెం-నర్సీపట్నం రోడ్డులో గోతులు పూడ్చాలి

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం తాళ్లపాలెం గ్రామం మీదుగా పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా ఉన్నదని, ఈ రహదారిలో గోతులను వెంటనే పూడ్చాలని బిఎస్‌పి జిల్లా ఇన్‌ఛార్జి సూదికొండ మాణిక్యాలరావు డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలసి శుక్రవారం ఆయన తాళ్లపాలెం సంత సమీపంలో రోడ్డుపై ఉన్న పెద్ద పెద్ద గోతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోతుల్లో వర్షపు నీరు చేరి ప్రమాదకరంగా మారాయని, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు పెద్దాడ కనకమహాలక్ష్మి, నాగభూషణం పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందిస్తుందని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ చెప్పారు. మండలంలోని ఎం జగన్నాథపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి విశాఖ జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్, చెస్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె.బుల్లెమ్మ, హైస్కూల్ హెచ్ఎం కె.రాజా రత్నకుమార్, స్కూల్ కమిటీ ఛైర్మన్ ఉగ్గిన వీర కాత్యాయిని, మాజీ గ్రామ సర్పంచ్ కె సూర్యప్రకాష్ పాల్గొన్నారు.



సబ్ జైల్ అధికారులతో సమావేశమైన జడ్జి, ఆర్‌డిఒ

సబ్ జైల్‌ను సందర్శించిన సివిల్ జడ్జి

ప్రజాశక్తి-ఎలమంచిలి టౌన్ : విశాఖపట్నం సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్. సన్యాసి నాయుడు, అనకాపల్లి ఆర్‌డిఒ షేక్ ఆయిషా, ఇతర అధికారులతో కలిసి శుక్రవారం యలమంచిలి సబ్ జైల్‌ను సందర్శించారు. ఖైదీల సంక్షేమం గురించి అడిగి తెలుసుకున్నారు. జైలులో ఉన్న వారి కేసుల పరిస్థితులపై ఆరా తీశారు. ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే చేస్తామని చెప్పారు. సబ్ జైలులో సౌకర్యాలు ఎలా ఉన్నాయో ఆరా తీశారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే చెప్పాలని కోరారు. పరిశు భ్రత, మెనూ కచ్చితంగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్, తహశీల్దారు, జిల్లా హెచ్‌ఒడి స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని సుందరయ్యపేట సచివాలయం వద్ద ఉపాధి హామీ పథకం కూలీలకు శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిడి మణికుమార్ కొత్తగా చేయవలసిన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. గతంలో చేసిన పనులకు పేమెంట్లు వచ్చాయా? లేదా? అని ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సి హెచ్.చంద్రశేఖర్‌రావు, ఎపిఒ మళ్ల శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ బండారు వాసు, కూటమి నాయకులు బండారు సూర్యనారాయణ, మేట్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ముగిసిన ప్రకృతి వ్యవసాయ శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి : రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో అనకాపల్లి మండలంలో ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా కార్యాలయంలో గురు, శుక్రవారం నిర్వహించిన రైతు సాధికార సంస్థ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ముగిసింది. యువజన టెక్నికల్ ఆఫీసర్ ప్రకాష్ మాట్లాడుతూ రైతులందరూ ప్రకృతి వ్యవసాయం విధానాల పాటించడం వల్ల ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. రాబోయే కాలంలో ఎటువంటి పురుగుల మందులు ఎరువులు ఉండవని, ప్రతి ఒక్కరు ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన ఉత్పత్తిలోనే తినడం జరుగుతుందని తెలిపారు. దీనిపై రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో సిబ్బంది అందరికీ రెండేసి రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం డిపిఎం లచ్చన్న పాల్గొన్నారు.

వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : కొద్ది రోజులుగా ప్రతి రోజూ కురుస్తున్న వర్షాలకు జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. ఏ పనులు చేసుకోలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షానికి పంటలకు సైతం నష్టం వాటిల్లితోంది. వరి, చెరుకు పంటల్లో అధికంగా నీరు చేరింది. శుక్రవారం మధ్యాహ్నం నుండి మండలంలోని పలు గ్రామాల్లో కుండపోత వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. చెరువుల్లోనికి భారీగా వర్షపు నీరు చేరింది.

పంచాయతీరాజ్ పురోగతిపై సమీక్ష

ప్రజాశక్తి-కోటవురట్ల : మండలంలో పంచాయతీ రాజ్ శాఖ అభివృద్ధి పురోగతిపై శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో చంద్రశేఖర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో కల్పించాల్సిన మౌలిక వసతులతో పాటు అభివృద్ధి పనుల పట్ల సిబ్బంది దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానంగా పారిశుధ్యం, తాగునీరు, విద్య, వైద్యం, ఆరోగ్యం పట్ల అధికారులు నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి కూర్మారావు, పియర్ ఇంజనీర్ వర్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ శ్రీనివాస్, హౌసింగ్ ఇంజనీరు వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రఘురాం, పలువురు మండల, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ చంద్రశేఖర్

భూ ఆక్రమణలపై సభ్యుల మండిపాటు

పోలేపల్లిలో రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణలను తొలగించాలని డిమాండ్



మాట్లాడుతున్న పోలేపల్లి సర్పంచ్ పైడినాయుడు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని పోలేపల్లిలో రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని సభ్యులు ధ్వజమెత్తారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరి దేవి అధ్యక్షతన శుక్రవారం బుచ్చయ్యపేటలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పోలేపల్లి సర్పంచ్ సీతా పైడినాయుడు మాట్లాడుతూ గ్రామంలోని మెయిన్ రోడ్డుకి అనుకొని సర్వేనెంబర్ 156లో 216 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతకాలంగా స్థానిక కూటమి నేతలు జెసిబితో చదునుచేయించి, యూకలిప్టస్ మొక్కలు నాటారని తెలిపారు. దీనిపై రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోలేదన్నారు. నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని గతంలో అధికారులను కోరితే మండల కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలోపు భూముల్లో డి.ఫామ్ పట్టాలు ఇవ్వడానికి కుదరదని చెప్పారని, కాని ఇప్పుడు దర్జాగా కూటమినేతలు భూములను ఆక్రమించినా ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. వైస్ ఎంపీపీ దొండా లలిత మాట్లాడుతూ వడ్డాదిలో 400 ఎకరాల జిరాయితీ భూములను ఇనాంలో కలిపేశారని, దీనివలన అమ్మకాలు, కొనుగోలు నిలిచిపోయాయని తెలిపారు. 15 రోజుల్లోగా రీ సర్వే చేసి ఇనాం సమస్యను పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఆర్.భీమవరం సర్పంచ్ అమ్మునాయుడు మాట్లాడుతూ సెజ్ ఏర్పాటుకు తమ గ్రామ రైతులు భూములిచ్చే పరిస్థితి లేదన్నారు. తహసిల్దార్ లక్ష్మీ స్పందిస్తూ పోలేపల్లిలో భూ ఆక్రమణలు తొలగిస్తామన్నారు. విద్యుత్ సమస్యలపై మరికొంత మంది సభ్యులు మాట్లాడారు. జడ్పిటిసి దొండా రాంబాబు మాట్లాడుతూ సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో శివప్రసాద్ నారాయణ, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండాలి

ప్రజాశక్తి-పరవాడ : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ముందుండాలని స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మీ శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్యే రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, నీటిపారుదల, గృహనిర్మాణం, విద్యుత్ తదితర శాఖలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల అభివద్ధి కోసం ప్రతి శాఖ సమన్వయంతో పని చేయాలని సూచించారు. మండలంలో జరుగుతున్న పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రమేష్ నాయుడు, తహసీల్దార్ నాగరాజు, మండలంలోని సర్పంచ్లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

పిఎసిఎస్ అధ్యక్షులుగా శ్రీను, మజ్జి

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట, నరసింగబిల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీల అధ్యక్షులుగా సిదిరెడ్డి శ్రీను, మజ్జి నిరంజన్ కుమార్ నియమితులయ్యారు. కొంత కాలంగా ఈ రెండు పదవులపై తర్జనబర్జన జరిగింది. చివరికి ఇవి టిడిపికి చెందన వారికి దక్కాయి. సిదిరెడ్డి శ్రీను జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్‌గా, మజ్జి నిరంజన్ కుమార్ జె.తుని ఎంపిటిసి సభ్యునిగా గతంలో పని చేశారు. వీరి ఎంపిక పట్ల పలువురు టీడీపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.




సిదిరెడ్డి శ్రీను, మజ్జి నిరంజన్ కుమార్

గ్రామస్థాయి బాలల రక్షణ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం, వడ్డాది సచివాలయంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం వారి ఆధ్వర్యంలో గ్రామస్థాయి బాలల రక్షణ కమిటీ (విలేజ్ లెవెల్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ)ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ సలహాదారులు పి.మంగ మాట్లాడుతూ బాల్య వివాహం నిరోధక చట్టం, బాలికలపై లైంగిక వేధింపులు, చైల్డ్ బెగ్గింగ్, పోక్సో యాక్ట్, డ్రగ్స్, చైల్డ్ లేబర్, బాల బాలికలకు (0-18 సంవత్సరాలు) సంబంధించిన ఎటువంటి సమస్యలున్నా జిల్లా బాలల సంరక్షణ విభాగానికి తెలియజేయాలని, లేదంటే 1098 చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ నిర్మాదేవి, పంచాయతీ కార్యదర్శి లోవరాజు, సర్పంచ్ కోరుకొండ కామరాజు, డిస్టిక్ మెంటల్ హెల్త్ సైకాలజిస్ట్ బి.అనిల్ కుమార్, మహిళ పోలీసులు ఉమా, భాను, స్కూల్, కాలేజ్ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఆశా, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో మేఘనకు బంగారు పతకం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : స్థానిక అచ్యుత జూనియర్ కళాశాల విద్యార్థిని బి.మేఘనా బ్లెస్సీ మార్షల్ ఆర్ట్స్‌లో బంగారు పతకం సాధించింది. ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సబ్బవరంలో నిర్వహించిన మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో మేఘన పాల్గొని ప్రతిభ చూపించింది. ఈ మేరకు మేఘనను డీఐఈఓ మద్దిలి వినోద్ బాబు, కరస్పాండెంట్ పల్లి శేషగిరిరావు, ప్రిన్సిపాల్ రాజాన సత్యనారాయణ, యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు అభినందించారు.

డిసెంబర్ 6, 7 తేదీల్లో గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఎంహెచ్ స్కూల్ (జివిఎంసి ప్రధాన ఉన్నత పాఠశాల) 1975 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు డిసెంబర్ 6, 7 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు నిర్వాహక కమిటీ తెలియజేసింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక భవనంలో కమిటీ గౌరవ అధ్యక్షులు, గాజువాక మాజీ కౌన్సిలర్ పిళ్ళా రామకృష్ణ, అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్, కార్యదర్శి మళ్ల లోకేశ్వరరావు, కోశాధికారి రాపేటి నారాయణరావు, కె.ఆదినారాయణ, బొమ్మిడి అప్పారావు, ఆడారి నారాయణ మూర్తి, ఆడారి మల్లికార్జున రావు, కేవీఎస్ మూర్తి, గవ్వా రాంబాబు, బొడ్డు అప్పలరాజు, బొప్పే ఉమా మహేశ్వరరావు సమక్షంలో కార్యక్రమం బ్రోచర్, లోగో విడుదల చేశారు. కార్యక్రమ ప్రణాళిక గురించి చర్చించడం జరిగింది.



ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు

ఎన్టీఆర్ హాస్పిటల్‌లో రూ.70 లక్షలతో ఆపరేషన్ థియేటర్

ప్రజాశక్తి-అనకాపల్లి, అనకాపల్లి రూరల్ : స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ కృషితో అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా హాస్పిటల్‌లో రూ.70 లక్షలతో ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేశారు. నోవాపోరా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సిఎస్ఆర్ గ్రాండ్ రూ.70 లక్షలతో ఆధునిక పరికరాలతో ఏర్పాటు చేసిన ఈ ఆపరేషన్ థియేటర్‌ను శుక్రవారం ఆస్పత్రి సూపరెంటెండెంట్ డాక్టర్ కృష్ణారావు అభివద్ధి కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఆళ్ల రామచంద్రరావు, శాంతి కుమారి రామకృష్ణ, గొర్లె శేఖర్, ఉల్లింగల రమేష్, డాక్టర్ డిడి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి మండల అధ్యక్షులుగా మరోసారి కోన నియామకం

ప్రజాశక్తి-పరవాడ : రావాడ పంచాయతీ పరిధి ధర్మారాయుడుపేట గ్రామానికి చెందిన కోన రామారావు వైసిపి మండల అధ్యక్షునిగా మరోసారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా కోన రామారావు మాట్లాడుతూ తనపైపై విశ్వాసం ఉంచి రెండోసారి ఈ బాధ్యతలు అప్పగించిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్‌కి, నియోజకవర్గం సమన్వయకర్త అన్నం రెడ్డి అదీప్‌రాజుకి, రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావుకు, జడ్పిటిసి పిఎస్ రాజుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ అభివృద్ధికి కష్టపడి పని చేస్తానని చెప్పారు.



కోన రామారావు

ముఖ్యమైన రైళ్లకు అనకాపల్లిలో హాల్ట్ కల్పించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా కేంద్రమైన అనకాపల్లి ఎ గ్రేడ్ రైల్వే స్టేషన్‌లో ఎట్‌టిటి వంటి దూరప్రాంతాలకు వెళ్లే ప్రధాన రైళ్లు నిలుపుదల చేసేలా అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు, రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్ చర్యలు తీసుకోవాలని పట్టణంలో ప్రయాణికుల తరపున విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పిల్లా శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ఎంపీ రమేష్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనకాపల్లి జిల్లా పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న దృష్ట్యా పలు ముఖ్య ట్రైన్లకు అనకాపల్లిలో హాల్ట్ కలిగించాల్సిందిగా కోరారు.

రైవాడ జలాశయం పరిశీలన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని రైవాడ జలాశయాన్ని జిల్లా ఇరిగేషన్ పర్యవేక్షక ఇంజనీర్ (ఎస్ఈ) పి.అప్పలనాయుడు శుక్రవారం సందర్శించారు. అనంతరం రైవాడ జలాశయ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని అన్ని జలాశయాలు నిండుగా ఉన్నాయన్నారు. పెద్దేరు, కోనాం, రైవాడ జలాశయాల నుండి ఇన్‌ఫ్లోకు అనుగుణంగా నీటి విడుదల కొనసాగుతోందని చెప్పారు. రైవాడ జలాశయం ఆధునికరణకు సంబంధించి జైకా నిధులకు గతంలో పంపిన రూ.30 కోట్ల ప్రతిపాదనను రివైజ్ చేసి రూ.40 కోట్లకు పెంచినట్లు తెలిపారు. ఆర్‌ఆర్‌ఆర్ పథకంలో జిల్లాకు రూ.133 కోట్లతో 48 పనులకు ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజనీర్ ఏ.త్రినాధం, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ జి.సత్యం నాయుడు, రైవాడ జలాశయ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పోతల పాత్రు నాయుడు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఇరిగేషన్ ఎస్ఇ అప్పలనాయుడు

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ తగదు


చీడికాడలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న బూడి

ప్రజాశక్తి-చీడికాడ: పేద విద్యార్థుల డాక్టర్ల విద్యాభ్యాసం కోసం దూరదృష్టితో ఆలోచించి వైసిపి మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆంధ్ర రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు నిర్మించాలని తలపెట్టారని, వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటీపరం చేయడం సరికాదని మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. మండలంలోని అప్పలరాజుపురం గ్రామంలో వైసీపీ మండల పార్టీ కన్వీనర్ రాజబాబు ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణపై కోటి సంతకాల సేకరణలో భాగంగా నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జయమ్మ నారాయణమూర్తి, జడ్పిటిసి శారద జానకిరామ్, సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ స్వాతి కొండబాబు, సిడిసి చైర్మన్ సుంకర శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు షేక్ సూర్య నారాయణ పాల్గొన్నారు

నర్సీపట్నంటౌన్: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలనే కూటమి ప్రభుత్వం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 28వ తేదీన నర్సీపట్నం నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఈ నేపథ్యంలో నర్సీపట్నం వైఎస్ఆర్సిపి కార్యాలయంలో శనివారం మాజీ శాసనసభ్యులు పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

అనకాపల్లి : మెడికల్ కాలేజీలలో ప్రైవేటీకరణ ప్రజా వ్యతిరేక చర్య అని, ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమం చేపడుతున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో కార్యక్రమం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమర్నాథ్ మాట్లాడుతూ ఈనెల 28న జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ డాక్టర్ సత్యవతి, వైసిపి అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయ కర్తలు కరణం ధర్మశ్రీ, పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సబ్బవరం : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యాన స్థానిక మూడు రోడ్లు జంక్షన్‌లో నిర్వహించారు. నాయకులు గండి రవికుమార్, ఎంపీపీ భోకం సూర్యకుమారి రామునాయుడు, కొటాన రాము, కర్రి బాబు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమంగా కొనసాగుతుందని దక్షిణ నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. ఆశీలుమెట్టలోని కార్యాలయంలో నియోజకవర్గ వైసిపి శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాన్ వెస్లీ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మధురవాడ : ప్రభుత్వవైద్యకళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 28న వైసిపి ప్రజా ఉద్యమం కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్ కోరారు. ఎండాడ పార్టీ కార్యాలయంలో సమావేశమై, కార్యాచరణ దిశానిర్దేశం చేశారు. సిరి సహస్ర, ఇతర నేతలు పాల్గొన్నారు.

తగరపువలస : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలంటూ ఒకటోవార్డులో వైసిపి శ్రేణులు ఇంటింటికీ వెళ్లి కోటి సంతకాల సేకరణ చేపట్టారు. వార్డు కార్పొరేటర్ అక్కరమాని పద్మావతి, రాము నాయుడు, జగ్గుపిల్ల ప్రసాద్, జివి రమణ, ఎ.చినబాబు పాల్గొన్నారు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

బస్సు యాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ 12 వరకు నిర్వహిస్తున్న బస్సుయాత్ర జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నాయకులు గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ, నవంబర్ 12న అనంతపురంలో ముగింపు సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పిపిపి విధానం విరమించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు గోవింద్, దొర, రాజేష్, కృష్ణ, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి- రావికమతం: మండలంలో చినపాచిల జడ్పీ హైస్కూల్ విద్యార్థిని రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ శ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చినపాచిల జడ్పీ హైస్కూల్ విద్యార్థిని కుసుమ వాలీబాల్ పోటీలలో మండల స్థాయి నుంచి డివిజన్ స్థాయి పోటీలలో గెలుపొంది రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల విజయ శ్రీ, పి.డి శివ, పాఠశాల వైస్ చైర్మన్ ఈశ్వరరావు ఆమెను అభినందించారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఆమె హాజరు కానున్నట్లు తెలిపారు.


ఎంపికైన క్రీడాకారిణితో పీడీ

బెల్టు షాపుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ ఉపేంద్ర



ప్రజాశక్తి -మాడుగుల: ప్రభుత్వ నిబంధనల ప్రకారం గొలుసు మద్యం దుకాణాలు (బెల్టు) నియంత్రణ చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ ఎల్ ఉపేంద్ర పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ, నాణ్యమైన మద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏపి ఎక్సైజ్ సురక్ష యాప్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ యాప్‌తో కొనుగోలు చేసిన మద్యం బాటిల్ ఎక్కడ తయారీ అయ్యింది, నకిలీదా, నాణ్యమైనదా అన్న విషయాన్ని గుర్తించడం జరుగుతుందన్నారు. మద్యం పాలసీ వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు గొలుసు దుకాణాలపై దాడి చేసి 51కేసులు నమోదు చేసి, 526 బ్లాటిళ్లు (102 లీటర్లు) స్వాధీనం చేసుకొని 51 మందిని అరెస్ట్ చేశామన్నారు. సారా బట్టీలపై దాడులు చేసి 23వేల 4వందలు పులుపు, 2వేల బెల్లం దిమ్మలు ధ్వంసం చేసి 50 కేసులు నమోదు చేసి 46మందిని అరెస్ట్ చేసి 420లీటర్ల నాటుసారాని స్వాధీనం చేసుకున్నామన్నారు. గొలుసు దుకాణాలు, నాటుసారా విక్రయాలపై సమాచారం ఇవ్వాలని కోరారు.

పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-నర్సీపటాన్ మండలంలో నీలంపేట గ్రామంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరంచ పాడి రైతుల సదస్సును పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో విశాఖ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సహకారంతో డాక్టర్ కే పుష్ప నేతృత్వంలో నిర్వహించారు. నీలంపేట సర్పంచ్ పెట్ల అప్పలనాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పశువుల పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. ఉచితంగా మినరల్ మిక్చర్ పౌడర్ ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పశువైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


మినరల్ మిక్చర్‌ను ఇస్తున్న సర్పంచ్

క్రికెట్ పోటీల్లో డిగ్రీ కళాశాల జట్టు సత్తా




కప్‌ను అందుకుంటున్న క్రీడాకారులు

ప్రజాశక్తి -మాడుగుల: ఆంధ్రాయూనివర్సిటీ వ్యవస్థాపితమై 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సెంటినరీ ఇనాగరల్ కప్పులో భాగంగా నిర్వహించిన టోర్నమెంట్లో రన్నర్ అప్ గా మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల టీం నిలిచిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సివిఎస్ఎస్ శాస్త్రి తెలియజేశారు. ఈ సందర్భంగా రన్నరప్‌గా నిలిచిన కళాశాల టీంకు ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య రాజశేఖర్ చేతుల మీదుగా 30వేల చెక్కును అందించారు. 70కు పైగా టీమ్‌లు పాల్గొన్న ఈ టోర్నమెంట్లో గ్రామీణ ప్రాంత విద్యార్థులు విజయం సాధించడం పట్ల కళాశాల అధ్యాపకులు విద్యార్థులు హర్షం తెలియజేశారు.

రైతులకు రుణాలు అందజేత

ప్రజాశక్తి- నక్కపల్లి: నక్కపల్లి పిఏసిఎస్ ద్వారా 15 మంది రైతులకు 40,52,000 రూపాయలు రుణం అందజేసినట్లు పిఏసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి తెలిపారు. శుక్రవారం రైతులకు రుణాలకు సంబంధించిన నగదును అందజేశారు. రుణాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కోసూరి శ్రీను, సంఘ సీఈఓ శ్రీనివాస్, సిబ్బంది ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


రైతులకు రుణాలు అందజేస్తున్న బుజ్జి

పిక్నిక్ స్పాట్లకు ప్రత్యేక బస్సులు

-నర్సీపట్నం డిపో మేనేజర్ ధీరజ్

ప్రజాశక్తి-నర్సీపట్నం: కార్తీక మాసం దృష్టిలో ఉంచుకొని భక్తులు ఒకే రోజు 5 శైవ క్షేత్రాలను దర్శించుకునే విధంగా బస్సులు ఏర్పాటు చేస్తున్నామని నర్సీపట్నం డిపో మేనేజర్ ధీరజ్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, ఈనెల 26 తేదీన, వచ్చేనెల 2,9,16 తేదీలలో అల్ట్రా డీలక్స్ బస్సులు పంచారామ క్షేత్ర దర్శనం కోసం ఏర్పాటు చేశామన్నారు. ఒక్కొక్కరికి రూ.1450 చొప్పున టికెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. కార్తీక వన సమారాధన పిక్నిక్ స్పెషల్ బస్సులను విద్యార్థులకు 10 శాతం రాయితీతో నర్సీపట్నం పరిసర ప్రాంతాలు ప్యాకేజీ 1 లంబసింగి, తాజంగి, కొత్తపల్లి జలపాతం, పాడేరు మోదకొండమ్మ, అమ్మవారి పాదాలు, టికెట్ ధర 360, ప్యాకేజీ 2 సింహాచలం, ఋషికొండ బాలాజీ టెంపుల్, రామ నారాయణ విజయనగరం, టిక్కెట్ ధర 430, ప్యాకేజీ 3, అమ్మవారి పాదాలు మినమలూరు కాఫీ తోట పాడేరు అమ్మవారి గుడి, పద్మావతి గార్డెన్, అరకు ట్రైబల్ మ్యూజియం, డుముకు వ్యూ పాయింట్, బొర్రా కేవ్స్, టిక్కెట్టు ధర 460 ధర ఉందన్నారు. ఈ ప్రదేశాలకు ఉదయం 5 గంటలకు బయలుదేరి సాయంత్రం 8 గంటలకు నర్సీపట్నం చేరుకుంటుందన్నారు, ప్రతి శనివారం వాడపల్లి వెంకటేశ్వర స్వామి దర్శనార్థం అల్ట్రా డీలక్స్ బస్సు నడుపుతున్నామని ఉదయం 5 గంటలకు నర్సీపట్నం నుంచి బయలుదేరుతుందన్నారు. ఆసక్తి కలవారు ఫోన్: 9494811855, 9493211 969 నెంబర్లను సంప్రదించాలని ఈ సందర్భంగా కోరారు.

కళాశాల అభివృద్ధికి నిధులు సమీకరణ

రూ. లక్ష విరాళం ప్రకటించిన స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి-నర్సీపట్నం: మాకవరపాలెం మండలం జూనియర్ కళాశాలలను స్పీకర్ అయ్యన్నపాత్రుడు శుక్రవారం సందర్శించారు. కళాశాల స్థితిగతులపై ఆరా తీసిన ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాలకు కలిపి 161 మంది విద్యార్థులు ఉండడం ఏంటని అసహనం వ్యక్తం చేశారు, కళాశాలకు మెరుగైన వసతి సౌకర్యం కల్పిస్తే నర్సీపట్నం, అనకాపల్లి ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని, కళాశాల అభివృద్ధికి తన వంతు లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. 10 లక్షలు మండల వాసులు నిధులు సమకూర్చితే 40 లక్షల మంజూరు చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు, ఇందులో భాగంగా మాకవరపాలెం మండలానికి చెందిన చిరంజీవి రాజు లక్ష రూపాయలు, గంగవరం సర్పంచ్ 50వేలు విరాళం ప్రకటించారు.

అన్నదానం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మున్సిపాలిటీ 8వ వార్డు రామారావుపేటలో ఉన్న జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పంచాద హరినాథ్ ఆధ్వర్యంలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర అన్నదానం చేపట్టారు. నాయకులు సురేష్, వెంకటరమణ పాల్గొన్నారు.


వడ్డిస్తున్న నేతలు

మంచినీటి పథకానికి మరమ్మతు పనులు

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో కవగుంటలో రక్షిత మంచినీటి పథకం మరమ్మతు పనులను సర్పంచ్ దాసరి సూర్యకుమారి శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సుమారు 1200 మంది జనాభా గలిగిన కవగుంట గ్రామానికి 20వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రక్షిత మంచినీటి పథకం ఒకటే ఉన్న కారణంగా, అధిక లోడుతో తరచూ మరమ్మతులకు గురవుతుందన్నారు. రెండవ ట్యాంక్ నిర్మాణం పూర్తయ్యే వరకు నీటిని చాలా పొదుపుగా వాడుకోవాలని సూచించారు.


చేపడుతున్న పనులు

బల్క్ డ్రగ్ వద్దంటే.. వద్దు...

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేట మత్స్యకారులు ఒకటే మాట.. ఒకటే నినాదంతో.. బల్క్ డ్రగ్ వద్దంటే.. వద్దు.. అంటూ జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో తేల్చి చెప్పారు. మండలంలో రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ నర్సీపట్నం ఆర్డిఓ వివి రమణ, తహసిల్దారు నరసింహమూర్తి, ఎంపీడీవో సీతారామరాజులతో కలిసి మత్స్యకారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు మత్స్యకారులు హెటిరో కంపెనీ కాలుష్యం కారణంగా పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కంపెనీ వ్యర్థ రసాయన జలాలు సముద్రంలో వదలడంతో మత్స్య సంపద నశించిపోతుందని, దీంతో ఉపాధి కోల్పోయామన్నారు. కంపెనీ వ్యర్థాలు ఉప్పుటేరులో కలవడంతో చేపలు చనిపోతున్నాయని, ఆ నీరు తాగి పశువులు మృత్యువాత పడ్డాయని తెలిపారు.అయినప్పటికీ చర్యలు చేపట్టలేదని కలెక్టర్ కు వివరించారు.

అంతా వినాశనం..

పరిశ్రమలు ఏర్పాటు చేయడంతో అభివృద్ధి జరుగుతుందని ప్రచారం చేయడం పేరుకేనని.. వాస్తవానికి జరుగుతుంది వినాశనం. 20 సంవత్సరాల క్రితం హెటిరో కంపెనీ ఏర్పాటు చేస్తున్నప్పుడు ఆ సమయంలో ఇంత నష్టం జరుగుతుందని తెలియలేదు. లేకుంటే అప్పుడే అడ్డుకునేవాళ్లం. బల్క్ డ్రగ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం వల్లే రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చింది. అధికారులు సకాలంలో స్పందించి ఉంటే ఆ పరిస్థితి వచ్చేది కాదు.



డి కృష్ణ, మత్స్యకారుడు

తేల్చి చెప్పిన మత్స్యకారులు

కేన్సర్ తో ఇబ్బంది పడ్డా

హెటిరో కంపెనీ కాలుష్యం కారణంగా కేన్సర్ బారిన పడి ఇబ్బంది పడ్డాను. కంపెనీ వ్యర్థ రసాయన జలాలు సముద్రంలో వదలడంతో మత్స్య సంపద నశించి పోవడంతో ఉపాధి కోల్పోయాం. తామంతా సముద్రం పై ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. బల్క్ డ్రగ్ వస్తే మా ప్రాణానికి ముప్పు వాటిల్లుతుంది.



మైలపల్లి బైరాగిరాజు,
మత్స్యకారుడు

16 గ్రామాల మత్స్యకారులకు నష్టం

బల్క్ డ్రగ్ ఏర్పాటును నిలుపుదల చేయకపోతే 16 గ్రామాల మత్స్యకారులకు నష్టం జరిగి రోడ్డును పడతారు. ఇప్పటికే హెట్రో కాలుష్యం కారణంగా ఉపాధి కోల్పోయాం. బల్క్ డ్రగ్ ను రద్దు చేస్తామని ప్రకటిస్తే కలెక్టర్ ఫోటో ఇంట్లో పెట్టుకుని పూజిస్తాం



గోసల సోమేశ్వరరావు,
మత్స్యకారుడు

వేటకు వెళితే గాని పూట గడవదు

మత్స్యకారులు వేటకు వెళితే గాని పూట గడవని పరిస్థితి. సముద్రంలో వేటకు వెళుతూ జీవనం సాగిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. మత్స్యకారులను సముద్రానికి దూరం చేయొద్దు.



గోసల కాసులమ్మ,
జడ్పిటిసి సభ్యులు

చట్టాలను ఉల్లంఘిస్తున్నారు

గ్రామసభలు పెట్టకుండా, పంచాయతీ తీర్మానం లేకుండా బల్క్ డ్రగ్ ఎలా ఏర్పాటు చేస్తారు. కేంద్ర పర్యావరణ శాఖ, అటవీ శాఖ అనుమతులు లేవు. అధికారులు చట్టాన్ని ఉల్లంఘించి ముందుకు వెళుతున్నారు.41 రోజుల నుండి బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తుంటే మెరైన్ అవుట్ పాల్ టెండర్లు ఎలా వేస్తారు. బల్క్ డ్రగ్ ఏర్పాటుకు ఇంకా సేకరించాల్సిన భూములకు సంబంధించి, భూములు ఇచ్చేందుకు రైతులు వ్యతిరేకిస్తున్నారు. ప్రజాభీష్టం లేకుండా బల్క్ డ్రగ్ ఏర్పాటు చేయడం తగదు.




మైలపల్లి మహేష్ బాబు,
మత్స్యకారుడు

పిల్లలను చంపుకోమంటారా

హెటిరో కంపెనీ కాలుష్యం మహిళలు అనేక అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. గర్భసంచి వ్యాధులు ప్రబలి, బిడ్డకు జన్మనివ్వని పరిస్థితుల్లో తీవ్ర ఆవేదనలో కొట్టుమిట్టాడు తున్నారు. పిండం కడుపులో ఉన్నప్పుడు స్కానింగ్ తీయించుకుంటే అనారోగ్య సమస్యలు, అంగవైకల్యం వంటి సమస్యలు బయట పడుతున్నాయి. చిన్నారులు ఏం చేయాలి? చంపుకోమంటారా?, రోగాలు బారినపడి ఆసుపత్రికి వెళ్తే వైద్యులు రాజయ్యపేట నా అని అడుగుతున్నారు. నాకు గర్భసంచి సమస్య వచ్చింది. ఆర్థికంగా ఉన్నాం కాబట్టి వైద్యం చేయించుకున్నాను. నాలాగ చాలామంది ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక సమస్య కారణంగా వైద్యం చేయించుకోలేక ఆవేదనకు గురవుతున్నారు. ఇదంతా హెట్రో కాలుష్యం కారణంగానే. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి తమ జీవితాలను నాశనం చెయ్యొద్దు.



గోసల కామేశ్వరి
మత్స్యకారిణి



నియామక పత్రాలను అందిస్తున్న అయ్యన్న...

ఉపాధి అవకాశాల కల్పనకు కృషి

ప్రజాశక్తి-నర్సీపట్నం: కూటమి ప్రభుత్వంలో మహిళలకు రానున్న రోజుల్లో పెద్దపీట వెయ్యినున్నట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు శుక్రవారం ఆయన మున్సిపాలిటీ కార్యాలయం వద్ద మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ సరోజినీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాకవరపాలెం మండలంలో నిర్మించ తలపెట్టిన కాఫీ పొడి కర్మాగారంలో మహిళలకు మాత్రమే ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా ఎనిమిది వందల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం తో పాటు కేవలం నియోజకవర్గ కుటుంబాలకు మాత్రమే ఈ అవకాశం కల్పించాలని నిబంధన పెట్టినట్లు తెలిపారు, జాబ్ మేళాకు సంబంధించి 18 కంపెనీలు అర్హులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. 131 మందిని ఎంపిక చేసినట్లు అధికారులు వెల్లడించారు, ఎంపికైన వారికి ధపత్రాలను అయ్యన్నపాత్రుడు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, జనసేన నర్సీపట్నం ఇన్చార్జి సూర్యచంద్ర, మున్సిపల్ కౌన్సిలర్ పద్మావతి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



స్టడీ టూర్‌లో విద్యార్థులు

ఆదర్శ పాఠశాల విద్యార్థుల స్టడీ టూర్

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో మరుపాక ఆదర్శ పాఠశాల విద్యార్థులు శుక్రవారం పారిశ్రామిక పర్యటన నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపల్ కె. సత్యసునీల్ తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒకేషనల్ విద్య పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు భవిష్యత్తులో ఐటీ పరిశ్రమలో ఉద్యోగ అవకాశాలు ఎలా ఉంటాయో, ఆ రంగానికి ఎలా సిద్ధం కావాలో ఐటీ పరిశ్రమ ముఖ్య అంశాలను తెలుసుకోవటానికి విద్యార్థులుతో ఈ పర్యటన చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు అప్పలనాయుడు, ఆదర్శ పాఠశాల చైర్మన్ కాసెట్టి రాజు పాల్గొన్నారు.

వైసిపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా బుల్లిదొర

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా మాకిరెడ్డి బుల్లిదొరని పార్టీ కేంద్ర కార్యాలయం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాకిరెడ్డి బుల్లిదొరని అభినందించారు. ఆయన నియామకం పార్టీ బలోపేతానికి దోహదం చేస్తుందని తెలిపారు.



సిపిఎం నేత అప్పలరాజు అక్రమ నిర్బంధాన్ని ఖండించండి

ప్రజాశక్తి-అనకాపల్లి : నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ఏర్పాటు చేయనున్న బల్క్ డ్రగ్ పార్క్‌ను మత్స్యకారులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో గ్రామానికి శుక్రవారం కలెక్టర్ వచ్చిన నేపథ్యంలో పోలీసులు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజును ఎస్.రాయవరం మండలం ధర్మవరంలో గృహ నిర్బంధం చేయడాన్ని ప్రతి ఒక్క ఖండించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా రాజయ్యపేట గ్రామస్తులు 40 రోజులుగా శాంతియుతంగా పోరాటం చేస్తున్నారని, జిల్లా కలెక్టర్‌కి బల్క్ డ్రగ్ బాధితుల సమస్యలు తెలయజేయడానికి వెళ్లనివ్వకుండా అప్పలరాజును గృహ నిర్బంధం చేయడం దారుణమన్నారు. సమస్యలపై జిల్లా కలెక్టర్‌తో చర్చించడానికి అప్పలరాజును అనుమతించాలని గ్రామ ప్రజలు కోరినప్పటికీ ప్రభుత్వం పోలీసు బెటాలియన్‌ను ధర్మవరంలో అప్పలరాజు ఇంటి వద్ద పెట్టడం ప్రజాస్వామ్య హక్కుల్ని హరించడమే అవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అణిచివేత, నిర్బంధ చర్యలను మానుకొని ప్రజల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి చర్చించి పరిష్కరించాలని కోరారు.

నర్సీపట్నంలో నిరసన

నర్సీపట్నంటౌన్ : బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా 40 రోజులుగా ఆందోళన చేస్తున్న మత్స్యకారుల పక్షాన నిలిచిన సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పలరాజును ప్రభుత్వం గృహ నిర్బంధం చేయడం దుర్మార్గమని ఆ పార్టీ డివిజన్ నాయకులు ఈరెల్లి చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక సిపిఎం నాయకులతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మీడియాతో మాట్లాడుతూ, కలెక్టర్ పర్యటన నేపథ్యంలో అప్పలరాజు ఇంటి వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, ఆయనను సమావేశానికి వెళ్లనివ్వకుండా అడ్డుకోవడం అన్యాయమన్నారు. ప్రజల ఇష్టానికి విరుద్ధంగా పరిశ్రమలను బలవంతంగా స్థాపించడం సరైన పద్ధతి కాదని తెలిపారు.



నర్సీపట్నంలో నిరసన తెలుపుతున్న సిపిఎం కార్యకర్తలు

'నకిలీ మద్యం పేరుతో రాష్ట్రంలో అలజడి'

ప్రజాశక్తి-అచ్యుతాపురం : నకిలీ మద్యం పేరుతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో అలజడి సృష్టిస్తున్నారని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ఆరోపించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో చేసిన అవినీతి అక్రమాలను పాపాలను ఎదుటి వారిపై నెట్టడంలో జగన్మోహన్ రెడ్డి, ఆయన బందం పీహెచ్డీ పొందారని ఎద్దేవా చేశారు. సమావేశంలో టిడిపి నాయకులు పీలా తులసీరామ్, లాలం శ్రీభరత్, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, గొర్లె శివన్నారాయణ మూర్తి, పెంటకోట విజయ్ పాల్గొన్నారు.